# అభివృద్ధేతర వ్యయానికి కళ్లెం




ఇది ఎంత తగ్గితే అంతమేర 'అభివృద్ధి వ్యయం' పద్దు కింద అదనంగా పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సౌలభ్యం ఏర్పడుతుంది.దేశంలో పెద్ద రాష్ట్రమైన ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎన్‌డీ వ్యయపద్దు కింద 202324లో రూ.1.61 లక్షల కోట్లు వెచ్చించగా, 202425లో అంతకన్నా ఏకంగా 22.2% ఎక్కువ (రూ.1.97 లక్షల కోట్లు) వ్యయమైందంటే.. తెలంగాణలో 'మైనస్ 18.8 శాతం' నమోదవడానికున్న ప్రాధాన్యం అర్థమవుతుంది.అలాగే బిహార్‌లో 34.4, కర్ణాటకలో 18, మధ్యప్రదేశ్‌లో 19.2, మహారాష్ట్రలో 16.7, తమిళనాడులో 11.2, ఏపీలో 3.3 శాతం చొప్పున.. ఇలా ప్రతి రాష్ట్రంలో ఎన్‌డీ వ్యయం పెరగడమే తప్ప తగ్గిందే లేదని, తెలంగాణ ఒక్కటే తగ్గించగలిగిందని ఆర్‌బీఐ వివరించింది. జాతీయస్థాయిలో కూడా ఇది సగటున 13.6% పెరిగింది.ఈ ఏడాది (202526లో) ఇదే పద్దు కింద రూ.50,320 కోట్లు ఖర్చుపెట్టాలని రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది. ఇది మొత్తం ఖర్చవుతుందా లేదా అనేది వచ్చే మార్చి ఆఖరుకల్లా తేలనుంది. ఈ మొత్తం కూడా 202324లో ఎన్‌డీ వ్యయం కింద పెట్టిన రూ.56,554 కోట్ల కన్నా తక్కువగానే ఉండటం గమనార్హం.ఎన్‌డీ వ్యయాన్ని తగ్గించి ప్రథమ స్థానంలో నిలిచిన తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి వ్యయం 24.8% పెంపుద్వారా 11వ స్థానంలో ఉంది. ఈ పెరుగుదల శాతం జాతీయస్థాయిలో 22.2గా నమోదైంది. ఈ క్రమంలో మణిపుర్ (96.9%), త్రిపుర (48.3%), బిహార్ (46.1%) తొలి మూడు ర్యాంకుల్లో నిలిచాయి.202324లో తెలంగాణలో అభివృద్ధి వ్యయపద్దు కింద రూ.1.62 లక్షల కోట్లకు పైగా ఖర్చవగా 202425లో రూ.2.03 లక్షల కోట్లు ఖర్చుచేశారు. ఈ ఏడాది కూడా గతేడాది కన్నా 15.5 శాతం పెంచి రూ.2.34 లక్షల కోట్లను వ్యయం చేస్తామని బడ్జెట్‌లో తెలంగాణ ప్రభుత్వం తెలిపినట్లు ఆర్‌బీఐ వివరించింది.అభివృద్ధి పనుల కోసం మూలధన వ్యయం ఎలా ఉందనేది ఆర్‌బీఐ విడిగా వివరించింది. దీనిప్రకారం తెలంగాణలో ఈ ఏడాది సామాజిక సేవల రంగానికి రూ.10,503 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారని గత మూడేళ్లలో ఇదే అధికమని తెలిపింది.మూలధన వ్యయం కింద 202425లో విద్య, క్రీడలు, సాంస్కృతిక రంగాలకు తెలంగాణ ప్రభుత్వం రూ.1,225.15 కోట్లు ఖర్చుచేయగా.. ఈ ఏడాది రూ.1,225.40 కోట్లు కేటాయించింది. ఈక్రమంలో వైద్యం, ప్రజారోగ్యంలో మూలధన వ్యయాన్ని రూ.1,320 కోట్ల నుంచి రూ.1,992.78 కోట్లకు.. రోడ్లు, వంతెనలకు రూ.947 కోట్ల నుంచి రూ.3,131 కోట్లకు పెంచింది.

## అత్యుత్తమ నాణ్యతకు మారుపేరుగా నిలుద్దాం



భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా ఎదుగుతోంది. యావత్ ప్రపంచం మనవైపు చూస్తోంది. ఇలాంటి సమయంలో ఉత్పత్తుల నాణ్యతపై దృష్టి పెట్టడమే అతిపెద్ద బాధ్యత. 'అలా జరిగిపోయిందిలే', 'జరుగుతుందిలే' అనే ఉదాసీనతే ఇకపై మనకు రాకూడదు. ఎలాంటి లోపాలు, దోషాలు లేని ఉత్పత్తులను పరిశ్రమలు తయారు చేయాలి. భారతీయ ఉత్పత్తి అంటేనే అత్యుత్తమ నాణ్యత అనేలా ఉండాలి. నాణ్యత.. నాణ్యత.. నాణ్యత.. ఇదే మన ఏకైక మంత్రం కావాలి. దాని ద్వారానే వికసిత్ భారత్ వైపు మన ప్రస్థానాన్ని వేగవంతం చేయగలం'' అని చెప్పారు.

అన్ని రంగాల్లోనూ మన అంకురాలు

''స్టార్టప్ ఇండియా కార్యక్రమాన్ని పదేళ్ల క్రితం ప్రారంభించినప్పటికి దేశంలో 500 కన్నా తక్కువ అంకుర పరిశ్రమలే ఉండేవి. ఇప్పుడు 2 లక్షలకు పైగా ఉన్నాయి. అంకురాల్లో ప్రపంచంలో మూడో స్థానానికి ఎదిగాం. ఈ ప్రయాణానికి నిజమైన హీరోలు భారత యువ ఆవిష్కర్తలే. ఏ రంగాన్ని తలచుకున్నా అక్కడ ఒక భారతీయ స్టార్టప్ ఉంటుంది'' అని మోదీ చెప్పారు. 2026ని 'కుటుంబ సంవత్సరం'గా ప్రకటించిన యూఏఈని ఆయన అభినందించారు.

## సింగరేణిలో భారాస హయాంలోనే టెండర్లు ఎక్సెస్‌కు కట్టబెట్టారు



బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఆమె ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "సింగరేణిలో సైట్ విజిట్ నిబంధన గతంలో కన్వేయర్ బెల్ట్ లాంటి వాటికి ఉండేది. ఇప్పుడు ఓబీకి కూడా పెట్టారు. కేటీఆర్ ఏ విషయమైనా అధ్యయనం చేసి మాట్లాడతారని అనుకునేదాన్ని. కానీ భారాస ప్రభుత్వంలో ఎక్సెస్‌కు టెండర్లు ఇవ్వలేదని ఆయన అన్నారు. నిజానికి చాలా టెండర్లను ఎక్సెస్‌కు ఇచ్చారు. సీఎం బావమరిదికి భారాస హయాంలోనూ కాంట్రాక్టులిచ్చారు. కానీ ఆయనను పెద్దగా చూపి.. ఒక బడా కాంట్రాక్టర్‌కు రూ.25 వేల కోట్ల పనులు కట్టబెట్టేందుకు హరీశ్‌రావు ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ ఓడిపోయే పార్టీ.. వచ్చే ఎన్నికల్లో గెలిచేది జాగృతి పార్టీయే. నేను కాంగ్రెస్‌లోకి వెళ్తున్నానని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌నే మా పార్టీలోకి ఆహ్వానిస్తున్నాం. ఆయన వస్తే నేషనల్ కన్వీనర్ పోస్ట్ ఇస్తాం. ఫోన్ ట్యాపింగ్ విచారణను ఓ జోక్‌గా మార్చారు. నాలాంటి బాధితులకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదు" అని కవిత తెలిపారు.

## ఉద్యమాలతోనే మహిళలకు సమానత్వం



ఎంతోమంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోంది. దాన్ని తిరిగి సాధించేందుకు మహిళాలోకం పోరాటం చేయాలి. చట్టసభల్లో ఆడవారికి రిజర్వేషన్ల చట్టం అమలులో కేంద్రం జాప్యం చేస్తోంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో పేదలు, మహిళలను ఓటుహక్కు నుంచి దూరం చేసేందుకు యత్నిస్తున్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో భాజపాకు వ్యతిరేకంగా ప్రచారం చేయాలి. ఉద్యమాలతోనే మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం లభిస్తాయి'' అని పేర్కొన్నారు. ప్రసంగం ప్రారంభానికి ముందు బృందా కారాట్ తెలుగులో మాట్లాడారు. 'ప్రియమైన సోదర సోదరీమణులారా! అందరికీ నమస్కారం. తెలంగాణ చరిత్ర..మహిళా ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమైంది. తెలంగాణ సంఘర్ష్ జిందాబాద్.. మల్లు స్వరాజ్యం జిందాబాద్.. మన హక్కులను కాపాడుకోవాలంటే భాజపా, ఆరెస్సెస్‌లను తరిమికొట్టాలి' అని అనడంతో సభ చప్పట్లతో మారుమోగింది.

సభకు హాజరైన జనం

మహిళల అభివృద్ధికి అవే అడ్డంకులు: శాంతా సిన్హా

ఆరోగ్య సమస్యలు, బాలికా విద్యలో వెనుకంజే దేశంలో మహిళల అభివృద్ధికి అసలైన అడ్డంకులని ప్రముఖ సామాజిక కార్యకర్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత శాంతా సిన్హా పేర్కొన్నారు. 'ప్రతి మహిళకు ఉచిత, నాణ్యమైన ఆరోగ్య సేవలు హక్కుగా అమలు కావాలి. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను ప్రతి అమ్మాయి హక్కుగా నిర్ధారించాలి. ప్రజారోగ్య వ్యవస్థ ప్రైవేటీకరణ దిశగా వెళ్లిపోవడంతో వైద్య ఖర్చులు మహిళలకు భారంగా మారాయి. ఎన్నికలప్పుడు ఇచ్చే రూ.23 వేలకు ఆశపడొద్దు. మనస్సాక్షి ప్రకారమే ఓటేయాలి' అని ఆమె కోరారు.

అన్యాయాలు చేసేవారిని నిద్రపోనివ్వం: మరియం ధవాలే

మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం కోల్పోయారని, దీన్ని మైక్రోఫైనాన్స్ సంస్థలు ఆసరాగా చేసుకొని అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ కుటుంబాలను నాశనం చేస్తున్నాయని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధవాలే అన్నారు. ఉపాధి కరవై... అప్పులు కట్టలేక పేద మహిళలు ఆత్మహత్యలు చేసుకుంటుంటే మోదీ ప్రభుత్వం మైక్రోఫైనాన్స్ సంస్థలకు అండగా ఉంటోందని మండిపడ్డారు.

నలుగురు మహిళలకు సత్కారం

ఐద్వా మహాసభల్లో తమిళనాడుకు చెందిన రాణి, బిహార్‌కు చెందిన బీబీ రుక్కార్, పుదుచ్చేరికి చెందిన యువ పర్వతారోహకురాలు దివ్య, రాజస్థాన్‌కు చెందిన రజియా బానును సత్కరించారు. తాము ఎదుర్కొన్న సవాళ్లు, న్యాయం కోసం చేసిన పోరాటాల గురించి వారు వివరించారు. తెలంగాణ నుంచి తొలి మహిళా జాతీయ బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి మిహాను కూడా సత్కరించారు. సదస్సులో ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి, రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఓట్లు తొలగించే కుట్ర...

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 'ఎస్ఐఆర్' పేరుతో మహిళలు, పేదల ఓట్లను తొలగించేందుకు చేస్తున్న కుట్రను సంఘటిత శక్తితో తిప్పికొట్టాలని ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పీకే శ్రీమతి కోరారు. 'పశ్చిమ బెంగాల్, బిహార్‌లలో 25 లక్షల మహిళా ఓట్లను తొలగించారు. రాజ్యాంగం సమాన హక్కులు కల్పించినా దేశంలో మహిళల పరిస్థితి దారుణంగా ఉంది' అని అన్నారు. నటి రోహిణి మాట్లాడుతూ.. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, సమానత్వం, నిర్ణయాధికారం ఇప్పటికీ చట్టపరమైన హక్కులుగానే ఉన్నాయని, అవి వాస్తవరూపం దాల్చాలంటే నిరంతర పోరాటాలు తప్పవని అన్నారు. స్వార్థం కోసం కాకుండా సమాజం కోసం ఆలోచించే మనసుతోనే మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు సుభాషిణీ అలీ మాట్లాడుతూ.. మహిళలు, పేదల పక్షాన నిలబడుతూ... గూండాగిరీకి వ్యతిరేకంగా కేరళలో పాలన సాగుతోందని, దేశమంతటా ఈ తరహా పాలన రావాల్సిన అవసరం ఉందన్నారు.

## అమెరికా చెప్పినవన్నీ అబద్ధాలే

ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) నుంచి అమెరికా నిష్క్రమణపై ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రెయెసస్ కీలక ప్రకటన చేశారు. తమ సంస్థ నుంచి వైదొలగడానికి దారితీసిన కారణాలపై అమెరికా చేసిన ప్రకటనలో వాస్తవికత లేదని ఆయన స్పష్టం చేశారు. మొత్తం మీద ఈ పరిణామం అమెరికాకు, ప్రపంచ దేశాలకు సురక్షితమైంది కాదన్నారు. భవిష్యత్తులో మళ్లీ డబ్ల్యూహెచ్‌వోలో అమెరికా చేరి క్రియాశీల పాత్రను పోషిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్' వేదికగా టెడ్రోస్ ఓ ట్వీట్ చేశారు. కరోనా వ్యాప్తిపై డబ్ల్యూహెచ్‌వో సకాలంలో తమకు సమాచారాన్ని అందించలేదని అమెరికా ప్రభుత్వం ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ జాప్యం వల్ల అమెరికాలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. ఈ మేరకు జనవరి 22న అమెరికా ఆరోగ్య మంత్రి కెనడీ జూనియర్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. తాజాగా దీనికి డబ్ల్యూహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ కౌంటర్ ఇచ్చారు. అమెరికా సర్కారు ప్రకటనపై డబ్ల్యూహెచ్‌వో అధికారిక స్పందనతో కూడిన నోటిఫికేషన్‌ను కూడా ఈ పోస్ట్‌కు జతపరిచారు.



## కల్లోలిత ప్రపంచంలో శాంతిదూత భారత్



మొదటి పేజీ తరువాయి

అనూహ్యం.. ప్రజా భాగస్వామ్యం: స్త్రీపురుష సమానత్వంతో కూడిన సమ్మిళిత గణతంత్ర దేశానికి భారత్ ఉదాహరణగా నిలుస్తోంది. మన త్రివిధ దళాల సన్నద్ధత, శక్తిసామర్థ్యాలపై ప్రజల్లో పూర్తి విశ్వాసం ఉంది. మనకున్న బలంతో శాంతి కోసం పాటుపడుతున్నాం. పరస్పర విశ్వాసంపై ఆధారపడిన సుపరిపాలన దిశగా వెళ్లే క్రమంలో పాతకాలం నాటి చట్టాలకు ప్రభుత్వం చెల్లుచీటీ రాసింది. దేశ లక్ష్యాల సాధనలో అనూహ్యరీతిలో ప్రజాభాగస్వామ్యం కనిపిస్తోంది. వలసవాద మనస్తత్వం నుంచి బయటపడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆత్మనిర్భరత, స్వదేశీ అనే రెండు సిద్ధాంతాలపై ప్రపంచంలో మూడోపెద్ద ఆర్థిక వ్యవస్థగా మన ప్రస్థానం సాగుతోంది'' అని రాష్ట్రపతి వివరించారు.

పౌరులకు ప్రేరణనిచ్చారు.. ప్రధాని: రాష్ట్రపతి చేసిన ప్రసంగం దేశ పౌరులందరికీ ప్రేరణను ఇచ్చి, ప్రజాస్వామ్య బలోపేతానికి వారి కట్టుబాటును పునరుద్ఘాటిస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాజ్యాంగ విశిష్టత, దేశాన్ని ముందుకు నడిపిస్తున్న బృందస్ఫూర్తి గురించి ఆమె ప్రధానంగా ప్రస్తావించారని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

## సైట్ విజిట్ నిబంధన తెచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వం




**భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు**

ఈకబురు హైదరాబాద్: సింగరేణిలో ఓబీ(ఓవర్ బర్డెన్) రిమూవల్ పనుల్లో సైట్ విజిట్ నిబంధన తీసుకొచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని భారాస శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు ఆరోపించారు. సింగరేణి స్కాంను సమర్థించుకునేందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంబంధం లేని కాగితాలను చూపిస్తూ అబద్ధాలను వండి వార్చారని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం హరీశ్‌రావు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ''సింగరేణి స్కామ్‌కు ఎవరు బాధ్యులు? ఎంతనష్టం వాటిల్లింది? లబ్ధిపొందిన వారెవరు? ఈ మూడు ప్రశ్నలకూ భట్టి సమాధానం చెప్పకుండా దాటవేశారు. 2018లోనే సైట్ విజిట్ సర్టిఫికెట్ ప్రతిపాదన ఉందని ఉపముఖ్యమంత్రి చెప్పారు. కానీ 'సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ లిమిటెడ్(సీఎంపీడీఐ)' ఇచ్చిన సిఫార్సు.. కేవలం పరిమిత ప్రాంతాల్లో జరిగే డిజైన్, సరఫరా, ఇన్‌స్టలేషన్, కమిషనింగ్ పనులకు మాత్రమే వర్తించే సాంకేతిక నిబంధన. సైనిక్ స్కూల్ వారు సైట్ విజిట్ నిబంధన పెట్టింది కూడా 'సప్లై అండ్ ఇన్‌స్టలేషన్ ఆఫ్ క్లాత్ డ్రైయర్' కోసం.. దీన్ని సింగరేణి ఓబీ కాంట్రాక్టుకు లింకు పెట్టి చూపడం హాస్యాస్పదం. ఒకవేళ 'సీఎంపీడీఐ' సిఫార్సు ఓబీ పనులకే అయితే.. 2018 నుంచి 2024 వరకు సింగరేణి పిలిచిన వందలాది ఓబీ టెండర్లలో ఈ షరతు ఒక్కసారి కూడా లేదు.. ఇప్పుడు 202526లో కొన్ని ఎంపిక చేసిన టెండర్లకే.. అకస్మాత్తుగా ఎందుకు తీసుకొచ్చారు.. 2025 మే తర్వాత ఓబీ రిమూవల్ కాంట్రాక్టర్లకు ఏ టెండర్ వచ్చినా.. సైట్ విజిట్ సర్టిఫికెట్ ఎవరికి ఇవ్వాలన్నా.. సీఎం సూత్రధారి, ఆయన బావమరిది పాత్రధారి.. అలాంటప్పుడు విచారణ కోసం ముఖ్యమంత్రితో మాట్లాడితే న్యాయం జరుగుతుందా? ఒక నైనీ గోల్డ్ బ్లాక్ టెండర్ రద్దు చేయడమే కాదు.. సైట్ విజిట్ సర్టిఫికెట్‌తో ఖరారైన టెండర్లన్నీ రద్దు చేయాలి. వీటిపై శ్వేతపత్రం విడుదల చేయాలి'' అని హరీశ్ డిమాండ్ చేశారు.

## ఫిబ్రవరి రెండో వారంలో పుర ఎన్నికలు



**కాంగ్రెస్ శ్రేణులకు మంత్రి ఉత్తమ్ దిశానిర్దేశం**

ఈకబురు నిజామాబాద్ అర్బన్, : రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు రెండు మూడ్రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందని, ఫిబ్రవరి రెండో వారంలో పోలింగ్ జరుగుతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్, ఆర్మూర్‌లో ఆదివారం జరిగిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో మంత్రి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశాం. 85 శాతం మంది అర్హులకు కొత్త కార్డులు జారీ చేశాం' అని పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ దేవుడి పేరుతో ఓట్ల రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. మతం పేరుతో ఓట్లడిగే వారిని ప్రజలు నమ్మొద్దన్నారు. తమకు భాజపా ఎంతదూరమో మజ్లిస్ కూడా అంతేదూరం అని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, నిజామాబాద్ గ్రామీణం ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

# వికసించిన పద్మాలు




ఈకబురు : న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవ వేళ కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డులను ప్రకటించింది. 2026 సంవత్సరానికి గాను ఆదివారం విడుదల చేసిన ఈ జాబితాలో వివిధ రంగాలకు చెందిన 131 మంది ప్రముఖులకు స్థానం దక్కింది. ఇందులో 5 పద్మవిభూషణ్, 13 పద్మభూషణ్, 113 పద్మశ్రీ పురస్కారాలు ఉన్నాయి. ఈసారి అవార్డు గ్రహీతల్లో 19 మంది మహిళలు ఉండగా, 16 మందికి మరణానంతరం పురస్కారాలు ప్రకటించారు. అలాగే విదేశీయులు, ఎన్నారైల విభాగంలో ఆరుగురు ఎంపికయ్యారు. కళలు, సామాజిక సేవ, ప్రజా వ్యవహారాలు, సైన్స్, వైద్యం, సాహిత్యం, క్రీడలు తదితర రంగాల్లో నిష్ణాతులైన వారికి పద్మ పురస్కారాలు ప్రకటించారు.

దేశానికి అసాధారణ సేవలందించినందుకు ఇచ్చే పద్మవిభూషణ్ పురస్కారం ఈసారి బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్రసింగ్ దేవల్ (మహారాష్ట్ర), కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్‌లను మరణానంతరం వరించింది. వీరితో పాటు ప్రజా వ్యవహారాల విభాగంలో కె.టి.థామస్(కేరళ), కళల విభాగంలో ఎన్.రాజమ్(ఉత్తరప్రదేశ్), సాహిత్యం, విద్య విభాగంలో పి.నారాయణన్ (కేరళ) ఈ అత్యున్నత గౌరవానికి ఎంపికయ్యారు. ఇక విశిష్ట సేవలకుగాను ఇచ్చే పద్మభూషణ్ జాబితాలో ప్రముఖ గాయని అల్కా యాగ్నిక్, మలయాళీ నటుడు మమ్ముట్టి, మాజీ గవర్నర్ భగత్ సింగ్ కోష్యారీ, పారిశ్రామికవేత్త ఉదయ్ కోటక్, టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృత్‌రాజ్, ప్రచార రంగ దిగ్గజం పియూష్ పాండే వంటి వారున్నారు.

తెలుగు రాష్ట్రాలకు పద్మ పంట

తెలుగు రాష్ట్రాలకు ఈసారి పద్మ పురస్కారాల్లో పెద్దపీట దక్కింది. ఆంధ్రప్రదేశ్ నుంచి సీనియర్ నటుడు, మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్‌ను కళల విభాగంలో పద్మశ్రీ వరించింది. అలాగే గద్దె బాబూ రాజేంద్ర ప్రసాద్(కళలు), మరణానంతరం గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్(కళలు), వెంపటి కుటుంబ శాస్త్రి(సాహిత్యం) ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి దీపికారెడ్డి(కళలు), వైద్య రంగంలో గూడూరు వెంకట రావు, పాల్కొండ విజయ్‌ఆనంద్‌రెడ్డి పద్మశ్రీ అందుకోనున్నారు. సైన్స్ రంగంలో చంద్రమౌళి గడ్డమణుగు, కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్, కుమారస్వామి తంగరాజ్, పశుసంవర్ధక విభాగంలో రామారెడ్డి మామిడి (మరణానంతరం) తెలంగాణ కీర్తిని ఇనుమడింపజేశారు. అలాగే.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) మాజీ చైర్మన్, తెలంగాణలోని నల్గొండ జిల్లాకు చెందిన మామిడాల జగదీశ్ కుమార్ సాహిత్యం, విద్యా రంగంలో పద్మశ్రీ వరించింది.

క్రీడా, సినీ రంగాలకు చెందిన పలువురు ఇతర ప్రముఖులకు కూడా పద్మశ్రీ దక్కింది. టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్ భుల్లర్, హాకీ క్రీడాకారిణి సవితా పునియాలను పద్మశ్రీ వరించింది. సినీ రంగం నుంచి బెంగాలీ నటుడు ప్రోసెన్‌జిత్ ఛటర్జీ, మరణానంతరం నటుడు సతీష్ షా, అనిల్ కుమార్ రస్తోగి ఈ జాబితాలో ఉన్నారు. మార్చి లేదా ఏప్రిల్‌లో రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా వీరు పురస్కారాలు అందుకోనున్నారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి పద్మశ్రీకి ఎంపికైన వారు

మాగంటి మురళీమోహన్(కళల విభాగం)
గద్దె బాబూ రాజేంద్ర ప్రసాద్(కళల విభాగం)
గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ (మరణానంతరం) కళల విభాగం
వెంపటి కుటుంబ శాస్త్రి(సాహిత్యం మరియు విద్య)

తెలంగాణ నుంచి పద్మశ్రీకి ఎంపికైన వారు

దీపికా రెడ్డి (కళల విభాగం)
గూడూరు వెంకట రావు (వైద్య విభాగం)
పాల్కొండ విజయ్ ఆనంద్ రెడ్డి (వైద్య విభాగం)
చంద్రమౌళి గడ్డమణుగు (సైన్స్-ఇంజనీరింగ్)
కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్ (సైన్స్, ఇంజనీరింగ్)
కుమారస్వామి తంగరాజ్ (సైన్స్, ఇంజనీరింగ్)
రామారెడ్డి మామిడి (మరణానంతరం)-పశుసంవర్ధక విభాగం

పద్మవిభూషణ్ (5)

దేశానికి అసాధారణ సేవలందించినందుకు ఇచ్చే రెండో అత్యున్నత పురస్కారం ఐదుగురిని వరించింది.

ధర్మేంద్రసింగ్ దేవల్ (మరణానంతరం): కళలు (మహారాష్ట్ర)
కె.టి.థామస్: ప్రజా వ్యవహారాలు (కేరళ)
ఎన్.రాజమ్: కళలు (ఉత్తర ప్రదేశ్)
పి.నారాయణన్: సాహిత్యం మరియు విద్య (కేరళ)
వి.ఎస్.అచ్యుతానందన్ (మరణానంతరం): ప్రజా వ్యవహారాలు (కేరళ)

పద్మభూషణ్ (13)

విశిష్ట సేవలకు గాను 13 మందిని పద్మభూషణ్ వరించింది.

అల్కా యాగ్నిక్: కళలు (మహారాష్ట్ర)
మమ్ముట్టి: కళలు (కేరళ)
ఉదయ్ కోటక్: వాణిజ్యం, పరిశ్రమలు (మహారాష్ట్ర)
భగత్ సింగ్ కోష్యారీ: ప్రజా వ్యవహారాలు (ఉత్తరాఖండ్)
విజయ్ అమత్‌రాజ్: క్రీడలు (అమెరికా)
పియూష్‌పాండే (మరణానంతరం): కళలు (మహారాష్ట్ర)

'ఆకాశ్' మార్గదర్శకుడు

మధిర: ఖమ్మం జిల్లా మధిరకు చెందిన ఆకాశ్ క్షిపణి మాజీ డైరెక్టర్ డా.గడ్డమణుగు చంద్రమౌళి ప్రతిష్టాత్మక పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. 1958 నవంబర్ 9న మధిరలో గడ్డమణుగు సత్యనారాయణరావు, సరస్వతిదేవి దంపతులకు జన్మించిన చంద్రమౌళి.. ప్రాథమిక విద్య నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివారు. వరంగల్ ఎన్ఐటీలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఢిల్లీ ఐఐటీలో ఎంటెక్, ఉస్మానియా యూనివర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ పట్టా పొందారు. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ)లో 34 ఏళ్ల పాటు ఉద్యోగం చేశారు.

మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం టీమ్‌లో సమర్థవంతంగా పనిచేశారు. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో ప్రఖ్యాతిగాంచిన ఆకాశ్ క్షిపణి ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేసి భారత ప్రభుత్వం మన్ననలు పొందారు. ఆకాశ్ సర్ఫేస్ టు ఎయిర్ క్షిపణి వ్యవస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా భారత వైమానిక దళం, సైన్యం కోసం క్షిపణి ఉత్పత్తి బాధ్యతలను నిర్వర్తించారు. ఆయన మార్గదర్శకత్వంలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఆకాశ్ క్షిపణి వ్యవస్థ విజయవంతంగా అభివృద్ధి చెందింది. 60 కంటే ఎక్కువ ఆకాశ్ క్షిపణుల విజయవంతమైన ప్రయోగాలను పర్యవేక్షించి, వ్యవస్థ పనితీరుపై రక్షణ దళంలో విశ్వాసాన్ని పెంచారు. ఆకాశ్ ప్రాజెక్ట్ ద్వారా దేశీయ రక్షణ పరిశ్రమకు రూ.22 వేల కోట్లకుపైగా ఆర్డర్లు లభించాయి.

వైద్యరంగంలో విశిష్ట సేవలకు..

సాక్షి, హైదరాబాద్: ఏఐజీ ఆసుపత్రి డైరెక్టర్ డా.గూడూరు వెంకట రావును పద్మశ్రీ వరించింది. ఏఐజీ హైదరాబాద్ ఆసుపత్రి ఆర్కిటెక్చర్‌గా, సహవ్యవస్థాపకుడిగా, అంతర్జాతీయంగా వైద్యరంగంలో అందించిన విశిష్ట సేవలకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది. గ్యాస్ట్రోఎంట్రాలజీలో వెంకటరావుకు మూడు దశాబ్దాలకుపైగా క్లినికల్ అనుభవం ఉంది. సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. డాక్టర్ జీవీ రావుగా పిలిచే ఆయన ఇప్పటివరకు 12,000కు పైగా సర్జరీలు విజయవంతంగా నిర్వహించారు. 'ట్రాన్స్ ఓరల్ ఎండోస్కోపిక్ అపెండెక్టమీ'లాంటి సంక్లిష్ట శస్త్రచికిత్సలు నిర్వహించినవారిలో ఆద్యుడు. డయాబెటిస్ చికిత్స కోసం 'మ్యాక్రో ఎన్‌క్యాప్సులేషన్ డివైజ్'ను రూపొందించిన వైద్యనిపుణుడిగా ఖ్యాతిగడించారు.

ప్రత్యేక అనుభూతినిచ్చింది: గూడూరు వెంకట రావు

వ్యక్తిగతంగా సాధించిన విజయాలన్నింటిలోనూ పద్మశ్రీ ప్రత్యేక అనుభూతినిచ్చింది. రోగి సంరక్షణకు అంకితభావంతో పనిచేసే నా సహోద్యోగుల బృందానికి, ఏఐజీ కుటుంబ సభ్యులకు రుణపడి ఉంటాను. నా కెరీర్‌కు మద్దతుగా నిలిచిన డా. నాగేశ్వర్‌రెడ్డిని తప్పనిసరిగా ఇక్కడ గుర్తుచేసుకోవాలి. ఆపరేషన్ గదికి మించి సంస్థ నిర్మాణం, విద్యా శిక్షణ-పరిశోధన, సమాజానికి సేవ చేసే రంగంలో గుర్తించినందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యేక కృతజ్ఞతలు. తరువాతి తరం సర్జన్లకు శిక్షణ ఇవ్వడం, ఆరోగ్య సంరక్షణ, సంస్థల బలోపేతం, నాణ్యమైన వైద్యం అందేలా చూడటం నా ప్రయాణంలో ప్రధానమైన అంశాలు.

పేదరికం నుంచి ప్రపంచ స్థాయికి..

డా.నోరి దత్తాత్రేయుడు (పద్మభూషణ్)

సాక్షి, అమరావతి: కేన్సర్ మరణ శాసనం కాదు.. సరైన సమయంలో గుర్తిస్తే ఆ మహమ్మారిని జయించవచ్చని నిరూపించి అంతర్జాతీయంగా ప్రసిద్ధిగాంచిన తెలుగుతేజం, ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడును 'పద్మ' పురస్కారం వరించింది. దత్తాత్రేయుడు కృష్ణా జిల్లా మంటాడ గ్రామంలో 1947 అక్టోబరు 21న జన్మించారు. కర్నూలు ప్రభుత్వ మెడికల్ కళాశాల నుంచి 1971లో ఎంబీబీఎస్ పట్టా తీసుకున్న ఆయన, ఉస్మానియా మెడికల్ కళాశాలలో పీజీ పూర్తిచేశారు. గాంధీ, ఉస్మానియా ఆస్పత్రిలో డాక్టర్‌గా పనిచేశారు. అనంతరం అమెరికా వెళ్లారు. తల్లిదండ్రులకు 12 మంది సంతానంలో ఆఖరివాడైన నోరి నాలుగో ఏటలోనే తండ్రిని కృష్ణా వరదల్లో కోల్పోయారు. అనంతరం.. అత్యంత పేదరికం అనుభవిస్తూ తన తల్లి కష్టాన్ని గుర్తెరిగిన ఆయన ప్రపంచంలోనే టాప్ అంకాలజిస్టుల్లో ఒకరిగా ఎదిగారు. కేన్సర్ వ్యాధిపై 4 పుస్తకాలు రాశారు.

విద్యారంగంలో కృషి..

నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం మామిడాలకు చెందిన జగదీశ్‌కుమార్‌కు పద్మశ్రీ అవార్డు లభించింది. లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్ విభాగానికి గాను కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించింది. జగదీశ్‌కుమార్ యూజీసీ చైర్మన్‌గా, జేఎన్‌యూ వైస్ చాన్స్‌లర్‌గా పని చేశారు. ఆయన తండ్రి రంగారావు ప్రభుత్వ ఉపాధ్యాయుడు, తల్లి జయప్రద పెద్దగా చదువుకోలేదు. ఇంట్లో పెద్దవాడైన జగదీశ్ 1 నుంచి 7 వరకు సొంతూరు మామిడాల ప్రాథమిక పాఠశాలలో చదివారు. ఇంటర్ వరకు మిర్యాలగూడలో, డిగ్రీ, ఎంఎస్సీ (ఎలక్ట్రానిక్స్) హైదరాబాద్‌లో చదివారు. మద్రాస్ ఐఐటీలో ఎంఎస్ చదివి అక్కడే పీహెచ్‌డీ పూర్తి చేశారు.

కెనడాలో పోస్ట్ డాక్టరేట్ ఫెలోషిప్ చేశారు. తర్వాత ఖరగ్‌పూర్ ఐఐటీలో ప్రొఫెసర్‌గా పని చేశారు. తర్వాత ఢిల్లీ ఐఐటీలో, జేఎన్‌యూ ఢిల్లీలో విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత మూడేళ్లు గేట్ చైర్మన్‌గా పనిచేశారు. 2016లో ఢిల్లీ జేఎన్‌యూ వైస్ చాన్స్‌లర్‌గా నియమితులయ్యారు. ఆ తర్వాత కేంద్రం ఆయనను యూజీసీ చైర్మన్‌గా నియమించింది. నానో ఎలక్ట్రానిక్ డివైసెస్, నానో స్కేల్ డివైస్ మోడలింగ్, సిమ్యులేషన్, ఇన్నోవేటివ్ డివైస్ డిజైన్, పవర్ సెమీ కండక్టర్ డివైజ్ విభాగంలో జగదీశ్ నిష్ణాతులు. ఆయన పరిశోధనల ఆధారంగా పలు పేటెంట్లు లభించాయి.

బాధ్యతను మరింత పెంచింది: జగదీశ్

పద్మశ్రీ అవార్డు నా బాధ్యతను మరింతగా పెంచింది. ఉన్నత విద్యను మరింతగా ముందుకు తీసుకెళ్లడంతోపాటు సరళంగా అందుబాటులోకి తెచ్చేందుకు చేయాల్సిన కృషిని ఈ అవార్డు నాపై ఉంచింది. రానున్న కాలంలో మన వర్సిటీలు, కళాశాలలను బలోపేతం చేయాలి. ఉపాధ్యాయులకు మరింత శిక్షణ ఇవ్వాలి. ఆవిష్కరణలను ప్రోత్సహించాలి.

గ్రామాల్లో ఆర్థిక సాధికారతకు బాటలు

శంషాబాద్: సహకార సంఘాల బలోపేతం.. పాడి పరిశ్రమ అభివృద్ధితో ప్రజలు సాధించే ఆర్థిక సాధికారతే సామాజిక శ్రేయస్సుగా నాలుగు దశాబ్దాలు కృషి చేసిన మామిడి రామారెడ్డికి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించింది. మామిడి భోజిరెడ్డి, లీలావతి దంపతులకు 1942 ఫిబ్రవరి 24న జన్మించారు. ఆయన తండ్రి భోజిరెడ్డి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేశారు. రాజకీయ నాయకుడిగానే కాకుండా నగరంలోని ఇందిరాసేవాదన్‌లో సంగం లక్ష్మీబాయి విద్యాసంస్థలను నెలకొల్పారు. రామారెడ్డి చాదర్‌ఘాట్ పాఠశాలలో చదివి ఆ తర్వాత నిజాం కళాశాలలో బీఎస్సీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి జర్నలిజం చేశారు. అమెరికాలోని ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయంలో రాజకీయాంశాలపై పీజీ చేశారు.

రాజేంద్రనగర్ బ్లాక్‌లోని పంచాయతీ సమితి అధ్యక్షుడిగా, శంషాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా పనిచేసిన రామారెడ్డి ఆ తర్వాత తండ్రి స్థాపించిన విద్యాసంస్థల ద్వారా మహిళలకు విద్యనందిస్తూనే సహకార వ్యవస్థ బలోపేతానికి శ్రీకారం చుట్టారు. గడచిన నాలుగు దశాబ్దాలుగా ఆయన సహకార వికాస సంస్థ పేరిట వరంగల్, కరీంనగర్, హనుమకొండ తదితర జిల్లాలో మొత్తం 755 సహకార సంఘాలను ఏర్పాటు చేయించారు. ఈ సంఘాలు ప్రస్తుతం 550 కోట్ల టర్నోవర్‌తో స్వయం సమృద్ధిని సాధించాయి. ఆయనకు పద్మశ్రీ రావడంపై అతని శంషాబాద్‌వాసులు హర్షం వ్యక్తం చేశారు. రామారెడ్డి గత అక్టోబరు 26న మరణించారు.

గుర్తింపు వచ్చినందుకు సంతోషం

స్వయం సమృద్ధి, పరస్పర సహకారమనే అంశాలతోనే ఆయన సహకార సంఘాలతో ఆర్థిక చైతన్యంతోపాటు సాధికారతకు బాటలు వేశాడని రామారెడ్డి భార్య శ్యామల 'సాక్షి'తో చెప్పారు. ఆయన సేవలను ప్రభుత్వం గుర్తించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఆయన లక్ష్యాన్ని ప్రభుత్వాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

ఐదున్నర దశాబ్దాలుగా నృత్యంలో...

తెలంగాణకు చెందిన నృత్య కళాకారిణి దీపికారెడ్డి. ఆమె 1965, సెప్టెంబర్ 15న హైదరాబాద్‌లో జన్మించారు. తండ్రి వీఆర్ రెడ్డి సొలిసిటర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహించారు. తల్లి రాధికారెడ్డి కూచిపూడి నృత్యకారిణి. తాత నూకల రామచంద్రా రెడ్డి మాజీ మంత్రి. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో 'దీపాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి' ద్వారా వేలాది మంది నృత్య దీపికలను తయారుచేశారు. ఐదున్నర దశాబ్దాలుగా నృత్య కళారంగానికి సేవ చేస్తున్నారు.

ప్రతి నెలా కొత్త కాన్సెప్ట్ : దీపికారెడ్డి

మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంది. కూచిపూడి నృత్యం అనేది ఒక కళ కాదు. అది భగవంతుని ఆరాధనగా భావిస్తాం. ఐదున్నర దశాబ్దాల కృషికి గుర్తింపు లభించింది. పౌరాణిక గాథలను వేదికల మీద, దేవాలయాల దగ్గర నృత్య ప్రదర్శనలు ఇచ్చినప్పుడు ఆ భగవంతుడికి దగ్గరయ్యామన్న అనుభూతిని పొందుతాం. అలాంటి అనుభూతిని ఈ రోజు పొందాను. ప్రతి నెలా ఒక కొత్త కాన్సెప్ట్‌ను కూచిపూడి నృత్యం ద్వారా ప్రజల ముందుకు తెస్తున్నాం. దీంట్లో భాగంగా పర్యావరణం, మహిళలు, సామాజిక అవగాహన అంశాలూ ఉంటున్నాయి. వెంపటి చిన సత్యం గారు గురువుగా లభించడం నాకు ఓ వరం. మా అమ్మ, నేను, నా కూతురు.. మూడు తరాలుగా నృత్య సాధన చేస్తున్నాం. ఈ కూచిపూడి నృత్య ప్రయాణంలో మా అమ్మానాన్నలు వీఆర్ రెడ్డి, రాధికా రెడ్డి, నా భర్త శ్యామ్‌గోపాల్, నా పిల్లలు అభినవ్, శ్లోకా.. నాకు ఎంతగానో సపోర్ట్ చేశారు. గీతాంజలి నృత్య అకాడమీ ద్వారా ఎంతోమంది దేశ విదేశాల్లో ఉన్న మా విద్యార్థులు మన భారతీయ సంస్కృతిని ముందుకు తీసుకెళ్తున్నారు. ఇన్నేళ్లుగా నన్ను ఆదరించి, ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. ఎంతోమంది కళాకారులు కనే అత్యుత్తమ కళ ఇది. ఎంతో సంతృప్తినిచ్చింది.

జన్యుశాస్త్ర రంగంలో సేవలకు..

లాలాపేట: హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-సీసీఎంబీ సైంటిస్టు డా.కుమారస్వామి తంగరాజ్‌ను పద్మశ్రీ పరస్కారం వరించింది. 'సీఎస్ఐఆర్ భట్నాగర్ ఫెలో'గా జన్యు శాస్త్ర రంగంలో చేసిన అత్యుత్తమ కృషికిగాను ఆయనకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది. ఆయన తమిళనాడు రాష్ట్ర చంగల్‌పట్ జిల్లా చేయుర్‌లో 1963 జూన్ 2న జన్మించారు. విద్యాభ్యాసం అంతా తమిళనాడులోనే చేశారు. భారతీయ జనాభా మూలం, అనుబంధాలు, వ్యాధి దృక్పథాలను అర్థం చేసుకోవడంలో తంగరాజ్ చేసిన పరిశోధనలు దోహదపడతాయి.

రేడియేషన్ ఆంకాలజీలో విస్తృత సేవలు

దేశ అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన పద్మశ్రీ స్వీకరించిన డాక్టర్ విజయానంద్ రెడ్డి 1982లో హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కాలేజీ నుంచి ఎంబీబీఎస్‌లో ఉత్తీర్ణత పొందారు. తర్వాత రేడియేషన్ ఆంకాలజీలో ఎండీ, డీఎన్‌బీలతో ప్రస్తుతం హైదరాబాద్‌లోని అపోలో కేన్సర్ సెంటర్‌లో ప్రొఫెసర్‌గా, హెచ్ఓడీగా... అలాగే ఆ సంస్థకు డైరెక్టర్‌గా సేవలందిస్తున్నారు. గతంలో ఆయన అసోసియేషన్ ఆఫ్ రేడియేషన్ ఆంకాలజిస్ట్స్ ఆఫ్ ఇండియాకు అధ్యక్షుడిగా, ఇండియన్ కాలేజ్ ఆఫ్ రేడియేషన్ ఆంకాలజీకి చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. నాలుగు దశాబ్దాలకు పైగా వైద్యరంగానికి అందించిన సేవలకుగాను ఆయనకు పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వరించాయి. ఆయన రాసిన అనేక వ్యాసాలకు బంగారు పతకాలూ అందాయి.

నా సేవలు నా దేశానికే: డాక్టర్ విజయానంద్ రెడ్డి

నా మాతృభూమికే నా సేవలు అంకితం కావాలనుకున్నాను.. అందుకే ఇక్కడే ఉండిపోయా. అప్పట్లో కేన్సర్‌ను ప్రాణాంతకమైన వ్యాధిగా చూసేకాలం నుంచి... క్రమంగా అది కూడా ఓ సాధారణమైన జబ్బు 'అదీ మామూలుగానే తగ్గిపోతుందిలే'అని పేషెంట్స్‌లో భరోసా నింపేలా కేన్సర్ రోగులకు సేవలందించా. నాలుగు దశాబ్దాలకు పైగా అందించిన సేవలను దేశం గుర్తించినట్లుగా ఓ మంచి అనుభూతికి లోనవుతున్నా. నాకు వచ్చిన 'పద్మశ్రీ'నాది మాత్రమే కాదు... రోగులకు వాళ్ల వెతలను దూరం చేయడంలో నాతోపాటు సహకరించిన నా సహాయకులు, మా ఆస్పత్రి సిబ్బందితోపాటు నా మీద నమ్మకముంచి ఆరోగ్యవంతులైన నా పేషెంట్లు అందరిదీ అని భావిస్తున్నా. ఈ అవార్డు నా బాధ్యతను మరింత పెంచింది.



# ధర్మపరిరక్షణను బాధ్యతగా స్వీకరించాలి

**గురు తేగ్ బహదూర్ బలిదానం పొరుగుదేశాల్లో హిందూ మైనారిటీల వేదనను గుర్తుచేస్తోంది**

**త్యాగంతోనే ధర్మపరిరక్షణ సాధ్యమని ఆయన చాటి చెప్పారు**

**షాహిదీ సమాగమంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్**

'అమరావతి: తల్వార్‌తో కాదు త్యాగంతోనూ ధర్మపరిరక్షణ సాధ్యమని చాటిన మహనీయుడు గురు తేగ్‌బహదూర్ అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. ధర్మం కోసం ప్రాణత్యాగం చేసిన చరిత్ర ఆయనదని, అందుకే దేశం ఆయనను కీర్తిస్తోందని కొనియాడారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో ప్రముఖ సిక్కు గురువు తేగ్ బహదూర్ 350 షాహిదీ సమాగమంలో పవన్ కల్యాణ్ ఆదివారం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. '350 ఏళ్లు గడిచినా మనమంతా తేగ్ బహదూర్ బలిదానాన్ని స్మరిస్తున్నామంటే ఆయన త్యాగం చారిత్రక సంఘటనే కాదు.. ప్రతి మనిషిలోని వివేకానికి పరీక్ష. 1675 నవంబరు 24న దిల్లీలోని చాందినీ చౌక్ వద్ద తేగ్‌బహదూర్ బలిదానం నేడు పొరుగు దేశాల్లో ఉన్న హిందూ మైనారిటీల వేదనను గుర్తుచేస్తోంది. ఆయన త్యాగం ఒక చరిత్రే కాదు, మనందరికీ హెచ్చరిక. ఆయన జీవితం నుంచి నేర్చుకోవాల్సింది ఒకటే.. దేశానికి నేడు బలంగా మాట్లాడే స్వరం అవసరం లేదు.. ఉన్నతమైన వ్యక్తిత్వంతో కూడిన స్వరం అవసరం. స్వతంత్ర ఫలాలను అనుభవించే ప్రతి పౌరుడు ధర్మపరిరక్షణను బాధ్యతగా స్వీకరించాలి' అని పవన్ కల్యాణ్ అన్నారు.

మహనీయులను అందించిన నేల మహారాష్ట్ర

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఉపముఖ్యమంత్రి అజిత్‌పవార్‌లతో ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

'ఆధ్యాత్మిక శక్తి సామాజిక జీవనానికి దారి చూపాలి. మహారాష్ట్ర ఎప్పుడూ ఇదే చెప్పింది. నిజమైన బలం ఆధిపత్యంలో కాదు పరోపకారంలో ఉంటుందని చాటిచెప్పింది. ఛత్రపతి శివాజీ నుంచి సంత్ తుకారాం, సంత్ జ్ఞానేశ్వర్, జ్యోతీబా ఫులే, బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి మహనీయులను దేశానికి అందించిన నేల మహారాష్ట్ర' అని ఉప ముఖ్యమంత్రి వివరించారు. 'దేశానికి నేడు మానవీయ విలువలు కాపాడే వీరత్వం, ఆత్మ పరిశీలన చేసుకునే వివేకం కలిగిన నాయకత్వం అవసరం. ప్రధాని మోదీ 2047 వికసిత్ భారత్ విజన్ కేవలం ఆర్థిక అభివృద్ధి మంత్రమే కాదు. సంస్కృతి, సంప్రదాయం, సామాజిక నిబద్ధత కూడా. యువత భాగస్వామ్యం లేకపోతే అది అసాధ్యం. నాందేడ్ పవిత్ర భూమి నుంచి మనమంతా సంకల్పం తీసుకుని గురు తేగ్ బహదూర్ లక్ష్యాలు ముందుకు తీసుకెళదాం' అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, సిక్కు మత పెద్దలు కుల్వంతర్, బల్వేందర్, బాబూ సింగ్ మహారాజ్, వివిధ రాష్ట్రాలకు చెందిన రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రికి కృపాణం బహూకరణ

సిక్కు మతపెద్దలు బహూకరించిన కృపాణంతో పవన్‌కల్యాణ్

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో కలిసి నాందేడ్‌లోని గురుద్వారాను సందర్శించిన పవన్ కల్యాణ్‌కు గురుద్వారా ఛైర్మన్ విజయ్ సత్పాల్‌సింగ్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ప్రముఖుల చేతుల మీదుగా సంప్రదాయ సిక్కు తలపాగాను ధరించారు. గురుద్వారా గ్రంథాలు.. పవిత్ర వస్త్రాన్ని పవన్ కల్యాణ్‌కు వేసి ఆశీర్వదించారు. సిక్కు మత పెద్దలు సిక్కులు ధరించే పవిత్ర ఆయుధం కృపాణాన్ని బహూకరించారు. అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ డొనేషన్ యంత్రాన్ని పవన్ కల్యాణ్ ప్రారంభించారు.



# 300 కి.మీ. రిక్షాపైనే ఆసుపత్రికి!



భార్యకు చికిత్స చేయించడానికి 75 ఏళ్ల భర్త అకుంఠిత సంకల్పం


ఈకబురు ,రాయగడ పట్టణం, : అసలే పేదరికం.. ఆపై సహకరించని వయసు. అయినా అనారోగ్యానికి గురైన భార్యకు ఆసుపత్రిలో చికిత్స చేయించేందుకు 75 ఏళ్ల వయసులోనూ ఏకంగా 300 కిలోమీటర్లు తోపుడు రిక్షాను తొక్కారు భర్త. ఒడిశాలో చోటుచేసుకున్న ఈ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. సంబల్‌పూర్ జిల్లా కేంద్రానికి చెందిన బాబు లోహర్ రిక్షా తొక్కుతూ జీవనం సాగిస్తున్నారు. ఆయన భార్య జ్యోతి(70)కి కొద్ది నెలల కిందట పక్షవాతం వచ్చింది. స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆమెను సుమారు 300 కి.మీ. దూరంలోని కటక్ ఎస్సీబీ వైద్య కళాశాల, ఆసుపత్రికి తీసుకెళ్లాలని లోహర్ నిశ్చయించుకున్నారు. చేతిలో చిల్లి గవ్వలేకపోవడం, వేరేవాళ్ల సాయం తీసుకోవడానికి మనసు ఒప్పుకోకపోవడంతో తనకున్న రిక్షాపైనే భార్యను తీసుకుని బయలుదేరారు లోహర్. పగలంతా రిక్షా తొక్కుతూ రాత్రివేళల్లో ఏదైనా దుకాణాల వరండాలో లేదా చెట్ల కింద సేద తీరేవారు. వీరి దీనస్థితి గమనించి ఎవరైనా తిండి పెడితే తినేవారు. ఆ విధంగా కటక్ ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడ రెండు నెలల చికిత్స అనంతరం జనవరి 19న జ్యోతిని డిశ్చార్జి చేశారు. అదే రిక్షాపై ఇంటికి తిరిగొస్తుండగా కటక్ శివారులోని గాంధీకూడలి పైవంతెన వద్ద ఓ ట్రక్కు వీరిని ఢీకొనడంతో జ్యోతికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో దగ్గరలో ఉన్న సీహెచ్‌సీలో ఆమెకు చికిత్స అందించారు. వీరి దుస్థితి చూసి తంగి పోలీసు స్టేషన్ పోలీసు అధికారి బికాష్ సెఠి రెండు ఏసీ బస్సు టికెట్లను కొనుగోలు చేశారు. మనసొప్పని లోహర్ సున్నితంగా తిరస్కరించి ఈ నెల 20న రిక్షాపైనే మళ్లీ ప్రయాణం మొదలుపెట్టారు. 'నా జీవితంలో నాకంటూ ఇద్దరే ఉన్నారు. ఒకరు నా భార్య, మరొకరు రిక్షా' అని లోహర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.



# ఓటు హక్కు వజ్రాయుధంతో సమానం

వజ్రాయుధంలాంటి ఓటు హక్కును ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా సద్వినియోగం చేసుకుంటే ప్రజాస్వామ్యం బలపడుతుందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవం రాష్ట్రస్థాయి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఆర్టికల్ 324 ప్రకారం భారత ఎన్నికల సంఘానికి కల్పించిన స్వతంత్రత, నిష్పక్షపాత, స్వేచ్ఛాయుత వాతావరణం న్యాయసమ్మతమైన ఎన్నికలకు పునాది అని అన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈఓ) సి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ''గత ఏడాది జాతీయ ఓటర్ల దినోత్సవం నుంచి ఇప్పటివరకు 3.93 లక్షల మంది కొత్త ఓటర్లు జాబితాలో చేరారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ(సర్) అంటే నిజమైన ఓటర్లను తొలగించడం కాదు. ద్వంద్వ, అనర్హత నమోదుల తొలగింపు'' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణికుముదిని, అదనపు సీఈవో వాసం వెంకటేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో హరిసింగ్ తదితరులు ఉన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను విజయవంతంగా నిర్వహించినందుకు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను ప్రత్యేక పురస్కారంతో గవర్నర్ సత్కరించారు. జిల్లా ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన కలెక్టర్లు పమేలా సత్పతి (కరీంనగర్), రిజ్వాన్‌బాషా షేక్ (జనగామ), డా.సత్యశారద (వరంగల్), కె.హైమావతి (సిద్దిపేట), ఎం.హనుమంతరావు (యాదాద్రి భువనగిరి), ఇలా త్రిపాఠి (నిజామాబాద్)కి పురస్కారాలు ప్రదానం చేశారు. సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరామ్, సీఈవో కార్యాలయంలోని అధికారులు బి.హరిసింగ్, బి.చెన్నయ్య, ఎన్.ప్రసూనాంబ, ఎం.జయశ్రీ, షేక్ జకీర్, మహమ్మద్ షరాజ్ అహ్మద్, ఎండీ షబ్బీర్ అహ్మద్, ఎం.చంద్రకళ, కె.సాంబశివరావు, ఎస్‌కే శకీర్ అహ్మద్, సీహెచ్ అశోక్, బి.రామ్మోహన్, జి.వరుణ్‌రెడ్డితో పాటు నియోజకవర్గాల అధికారులకు పురస్కారాలు అందజేశారు.



## వెండి రీసైక్లింగ్‌లోకి ఎంఎంటీసీపాంప్



విలువైన లోహాలను శుద్ధి చేసే సంస్థ ఎంఎంటీసీపాంప్, తమ విక్రయశాలల్లోనూ వెండి రీసైక్లింగ్ ప్రారంభించడానికి సిద్ధమవుతోంది. వచ్చే 3 నెలల్లోనే ప్రయోగాత్మక పద్ధతిలో వెండి రీసైక్లింగ్ ప్రక్రియ చేపడతామని సంస్థ ఎండీ, సీఈఓ సమిత్ గుహ తెలిపారు. వెండికి అధిక గిరాకీ ఏర్పడుతున్న నేపథ్యంలో, ధరలు గణనీయంగా పెరిగాయి. పాత వెండి ఆభరణాలను మార్చుకుని, కొత్తవి తీసుకోవాలనుకున్నా, విక్రయించాలనుకున్నా.. అందులో వెండి స్వచ్ఛతను నిర్ధారించడం ముఖ్యమవుతోంది. పాత వెండి అమ్ముకునే వారి వద్ద తీసుకుని, కొత్తగా విక్రయించేందుకు, దానిని శుద్ధి చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు ఆర్థిక వ్యవస్థ మరింత అనుకూలంగా ఉండటంతో, కంపెనీ వెండి రీసైక్లింగ్‌లోకి అడుగు పెడుతున్నట్లు సమిత్ పేర్కొన్నారు. వెండికి గిరాకీ గణనీయంగా పెరిగినా, అందుకు తగ్గట్టుగా అంతర్జాతీయ ఉత్పత్తి సామర్థ్యాలు పెరుగుతున్న సంకేతాలు కనిపించడం లేదని వివరించారు. వెండికి గిరాకీ ఇదే విధంగా కొనసాగితే, సరఫరా ఇబ్బందులు తలెత్తుతాయని, ఈ లోటును పూడ్చడంలో రీసైకిల్ చేసిన వెండి కీలక పాత్ర పోషిస్తుందని అంచనా వేస్తున్నారు. తొలుత దిల్లీలో: వెండి రీసైక్లింగ్‌ను ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని గుహ కోరారు. మన దేశంలో కుటుంబాల చేతిలో 25,000 టన్నుల బంగారం, అంతకంటే పది రెట్లు ఎక్కువ వెండి ఉన్నట్లు అంచనా వేస్తున్నట్లు వివరించారు. 'వెండి రీసైక్లింగ్ కోసం మా స్టోర్‌లలో పరికరాలను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. సిబ్బందికి కొంత శిక్షణ కూడా ఇందుకు అవసరం. అందుకే తొలుత కొన్ని స్టోర్‌లలో ప్రయోగాత్మకంగా వెండి రీసైక్లింగ్ ప్రారంభించి, తర్వాత మిగతా వాటికి విస్తరిస్తాం. తొలుత 34 నెలల్లో దిల్లీలో సేవలు ప్రారంభించే అవకాశం ఉంది. వెండిని కరగబెట్టి, నాణ్యత నిర్ధారించే (రీసైక్లింగ్, అసేయింగ్) కేంద్రాల్లోకి టెక్నాలజీ పెట్టుబడులు, పరికరాల నవీకరణ అవసరం' అని వెల్లడించారు. గత 12 నెలల్లో పసిడి కంటే వెండి రెట్టింపు ప్రతిఫలాలను ఇచ్చిందని, ఇప్పుడు కొత్త బంగారంగా వెండి మారిందన్నారు.

**--ఇప్పుడు 20 కేంద్రాలు....** పాత బంగారాన్ని పునర్వినియోగానికి సిద్ధం చేసేందుకు (పసిడి రీసైక్లింగ్ కోసం) ఎంఎంటీసీపాంప్ 20 స్టోర్‌లు నిర్వహిస్తోంది. వాటిని వెండి కోసమూ వినియోగించనుంది. వచ్చే అయిదేళ్లలో ఈ స్టోర్‌ల సంఖ్యను రెట్టింపు చేయాలని కంపెనీ చూస్తోంది. దక్షిణ, తూర్పు రాష్ట్రాల్లో విస్తరించడానికి సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం ఉన్న 24 లక్షల నాణేల వార్షిక తయారీ సామర్థ్యాన్ని 36 లక్షలకు పెంచుకోనుంది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఇకామర్స్ సంస్థల్లో నాణేలు, కడ్డీలు విక్రయించడం ద్వారా విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ 40 టన్నుల బంగారం, 50 టన్నుల వెండిని దిగుమతి చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు వరకు 36 టన్నుల బంగారం, 60 టన్నుల వెండి దిగుమతి చేసుకుంది. పసిడి, వెండి స్వచ్ఛతను నిర్ధారించేలా, ఎల్‌బీఎంఏ (లండన్ బులియన్ మార్కెట్ అసోసియేషన్) అక్రెడిటేషన్ కలిగిన ల్యాబ్‌ను దేశీయంగా ఎంఎంటీసీపాంప్ మాత్రమే నిర్వహిస్తుండటం గమనార్హం.

## దేశంలో వాణిజ్య విమానాల తయారీ!

### 27న ఎంబ్రాయర్‌తో అదానీ గ్రూప్ ఒప్పందం

దిల్లీ: మన దేశంలో పౌర విమానాల తయారీ కోసం తుది అసెంబ్లీ లైన్ ఏర్పాటు చేసే ప్రణాళికను అదానీ గ్రూప్, బ్రెజిల్‌కు చెందిన విమాన తయారీ సంస్థ ఎంబ్రాయర్.. మంగళవారం ప్రకటించనున్నాయి. పౌర విమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు సమక్షంలో అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, ఎంబ్రాయర్ ఎగ్జిక్యూటివ్‌లు ఈనెల 27న దిల్లీలో జరిగే కార్యక్రమంలో ఒక అవగాహనా ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాలు చేయనున్నారు. 'మన దేశంలో ఎంబ్రాయర్ జెట్‌లను తయారు చేయడానికి ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఏఎల్) ఏర్పాటు చేసే ప్రణాళిక'గా ఇది ఉంటుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పౌర విమానయాన మార్కెట్లలో ఒకటిగా మనదేశం ఉంది. దేశంలో కొత్త విమానాశ్రయాలు నిర్మితమవుతుండగా, సేవల విస్తరణ కోసం విమానయాన సంస్థలు కొత్త విమానాలను సమకూర్చుకుంటున్నాయి. విమాన ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరుగుతోంది. 150 సీట్ల వరకు ఉండే వాణిజ్య జెట్‌లను ఎంబ్రాయర్ తయారు చేస్తోంది. ప్రస్తుతం మనదేశంలో 50 ఎంబ్రాయర్ విమానాలు సేవలందిస్తున్నాయి.

## విలాసవంత ఇళ్ల ధరలు తగ్గొచ్చు!

### 2026-27లో గిరాకీ నెమ్మదించే వీలు
### ఐఎస్ఐఆర్ సర్వే

వచ్చే ఆర్థిక సంవత్సరం (202627)లో దేశంలోని ప్రధాన నగరాల్లో విలాసవంత ఇళ్లు/ఫ్లాట్లకు గిరాకీతో పాటు ధరలూ తగ్గొచ్చని ఒక సర్వే పేర్కొంది. 'ఇండియా లగ్జరీ రెసిడెన్షియల్ అవుట్‌లుక్ 2026' నివేదికలో ఈ విషయాన్ని ప్రాపర్టీ కన్సల్టెంట్ ఇండియా సోథెబైస్ ఇంటర్నేషనల్ రియాల్టీ (ఐఎస్ఐఆర్) తెలిపింది. సుమారు 700 మంది అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు (హెచ్ఎన్ఐ), అల్ట్రా హెచ్ఎన్ఐల అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదిక రూపొందించినట్లు సంస్థ తెలిపింది. ఈ సర్వేలో అభిప్రాయాలు తెలిపిన వారిలో 53% మంది మూలధన పెట్టుబడులు పెరుగుతాయనే విలాసవంత ఇళ్లపై పెట్టుబడి పెట్టారు. 47% మంది వ్యక్తిగత వినియోగం కోసం కొన్నారు.ఈ నివేదిక ప్రకారం.. అభిప్రాయాలు తెలిపిన వారిలో 56% మంది ధరలు తగ్గుతాయనే భావిస్తున్నారు. 202627లో జీడీపీ వృద్ధి 67 శాతంగా ఉండొచ్చని 72% మంది పేర్కొన్నారు. స్థిరాస్తిపై వార్షిక రాబడి 15% ఉంటుందని 67% మంది ధనిక పెట్టుబడిదారులు అంచనా వేస్తున్నారు. 2025లో దిల్లీఎన్‌సీఆర్, ముంబయి, గోవా, అలీబాగ్ వంటి ప్రాంతాల్లో విలాసంతవంత ఇళ్లు/ఫ్లాట్ల మార్కెట్ బాగానే రాణించింది. అంకుర సంస్థల వ్యవస్థాపకులు, తదుపరితరం ఔత్సాహికులు, సీనియర్ వృత్తి నిపుణుల వంటివారు విలాసవంత ఇళ్ల కొనుగోలుకు ముందకు రావడం ఇందుకు కారణం.

# వ్యాపార రంగంలో ప్రముఖ 'పద్మాలు'

**–ఉదయ్ కోటక్‌కు పద్మభూషణ్**









కేంద్ర ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన పద్మ పురస్కారాల్లో వాణిజ్య, పరిశ్రమల విభాగం నుంచి నలుగురు ప్రముఖులకు లభించాయి. బ్యాంకింగ్ రంగ దిగ్గజం ఉదయ్ కోటక్‌ను పద్మభూషణ్ వరించింది. టీటీ జగన్నాథన్ (మరణానంతరం), అశోక్ ఖడే, సత్యనారాయణన్ నువాల్‌లకు పద్మశ్రీ ప్రకటించారు. ఉదయ్ కోటక్ (పద్మభూషణ్): దేశంలోని దిగ్గజ బ్యాంకర్లలో ఉదయ్ కోటక్ ఒకరు. 1985లో కోటక్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ ఫైనాన్స్‌ను ఆయన స్థాపించారు. 2003లో ఆర్‌బీఐ బ్యాంకింగ్ లైసెన్స్ ఇవ్వడంతో, కోటక్ మహీంద్రా బ్యాంక్‌గా మారింది. ప్రస్తుతం ప్రైవేట్ రంగంలో 2000కు పైగా శాఖలతో కోటక్ బ్యాంక్ దూసుకెళ్తోంది. దేశవ్యాప్తంగా లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. బ్లూమ్‌బర్గ్ ప్రకారం.. ఆయన సంపద విలువ 15.5 బి.డాలర్లు (దాదాపు రూ.1.4 లక్షల కోట్లు).

అశోక్ ఖడే (పద్మశ్రీ): దళిత కుటుంబం నుంచి వచ్చిన అశోక్ ఖడే, స్వయంకృషితో వ్యాపారవేత్తగా ఎదిగారు. ప్రస్తుతం డీఏఎస్ ఆఫ్‌షోర్ ఇంజినీరింగ్ ఎండీగా వ్యవహరిస్తున్నారు. ఆఫ్‌షోర్ చమురు, గ్యాస్ పరిశ్రమలో ఈ సంస్థ కార్యకలాపాలు సాగిస్తోంది. డాక్‌యార్డ్ ట్రైనీ స్థాయి నుంచి ఆఫ్‌షోర్ ఫ్యాబ్రికేషన్ కంపెనీ అధిపతిగా అంచెలంచెలుగా ఎదిగారు.

సత్యనారాయణన్ నువాల్ (పద్మశ్రీ): ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్లోజివ్స్‌ను ఎగుమతి చేయడం కోసం 1995లో సోలార్ ఇండస్ట్రీస్ ఇండియాను ప్రారంభించారు. ప్రస్తుతం ఈ సంస్థకు దేశంలో 25 తయారీ కేంద్రాలున్నాయి. ఫోర్బ్స్ జాబితా ప్రకారం.. ఆయన సంపద విలువ 5.5 బి.డాలర్లు (దాదాపు రూ.52,000 కోట్లు).

టీటీ జగన్నాథన్ (పద్మ శ్రీ): 'ది కిచెన్ మొఘల్'గా ప్రసిద్ధి చెందిన టీటీకే ప్రెస్టీజ్ గౌరవ ఛైర్మన్ టీటీ జగన్నాథన్‌కు మరణానంతరం పద్మశ్రీ అవార్డు ఇచ్చారు. వంట, గృహోపకరణాల ఉత్పత్తుల్లో టీటీకే ప్రెస్టీజ్‌ను అగ్రగామి సంస్థగా మలచడంలో కీలక పాత్ర పోషించిన జగన్నాథన్, 2025 అక్టోబరులో మరణించారు. ప్రెజర్ కుకర్‌లకు జీఆర్ఎస్ భద్రతా విధానాన్ని ఆయన కనిపెట్టారు. ఐఐటీ చెన్నై నుంచి గోల్డ్ మెడల్ పొందిన జగన్నాథన్, అమెరికా కార్నెల్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తిచేశారు. టీటీకే ప్రెస్టీజ్ బోర్డులో 50 ఏళ్ల పాటు ఆయన ఉన్నారు. ఆరోగ్య సంరక్షణ, పారిశుద్ధ్యం, విద్యా రంగాల్లో ఆయన కృషి చేశారు.

# మరింత ఆకర్షణీయంగా ఉడాన్ పథకం

దేశంలో చిన్న నగరాలకూ విమాన సర్వీసులు అందుబాటులోకి తెచ్చేందుకు అమలు చేస్తున్న ప్రాంతీయ అనుసంధానత పథకాన్ని (ఉడాన్) మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు సమాచారం. మారుమూల ప్రాంతాలకు నడుస్తున్న సర్వీసుల వల్ల విమానయాన సంస్థలకు ఏర్పడుతున్న నష్టాలను పూడ్చడానికి, వాటికి ఆర్థికంగా మద్దతు ఇచ్చే ప్రణాళికకు కేంద్ర మంత్రివర్గ ఆమోదం లభించాల్సి ఉంది. ఉడాన్ పథకాన్ని 2016లో తొలిసారి ప్రారంభించారు. విమాన ప్రయాణాన్ని సామాన్యులకూ అందుబాటు ధరల్లో అందించడానికి వీలుగా ఈ పథకాన్ని చేపట్టారు. విమానంలో సగం సీట్లకు ఛార్జీల గరిష్ఠస్థాయిపై పరిమితి (సీలింగ్) విధించారు. అయితే రద్దీ తక్కువగా ఉండటం, టికెట్ ఛార్జీల పరిమితుల కారణంగా కొన్ని సర్వీసులు లాభదాయకంగా ఉండటం లేదు. ఆయా సర్వీసులను సంస్థలు నిర్వహించలేకపోతున్నాయి. దీన్ని పరిష్కరించడానికి, ప్రభుత్వం విమానయాన సంస్థలకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. విమాన ల్యాండింగ్, నావిగేషన్ ఛార్జీలపై మినహాయింపులు, సబ్సిడీలు వీటిల్లో ఉన్నాయి.

**--ప్రస్తుత సబ్సిడీలు ఇలా.....** ప్రస్తుతం ఒక్కో వాణిజ్య విమాన సర్వీసుకు ఇస్తున్న సబ్సిడీలో సుమారు 80% (రూ.6,500) రుసుము రూపేణ సబ్సిడీ ఇస్తున్నారు. మిగిలిన భాగాన్ని విమానాశ్రయాలు ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తున్నాయి.

**--ఇప్పటివరకు రూ.4,352 కోట్లు....** ఉడాన్ పథకం ప్రారంభించినప్పటి నుంచి సబ్సిడీగా రూ.4,352 కోట్లకు పైగా సబ్సిడీగా అందించారు. విమానాశ్రయాలను అభివృద్ధి చేసేందుకు అదనంగా రూ.4,638 కోట్లు పెట్టుబడి పెట్టారు. అయినా మిశ్రమ ఫలితాలే లభించాయి. 649 మార్గాల్లో 60% మాత్రమే ప్రస్తుతం పని చేస్తున్నాయి. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ 15 ప్రాంతీయ విమానాశ్రయాలపై సుమారు రూ.900 కోట్లు ఖర్చు చేసినా, అవి ప్రస్తుతం పని చేయడం లేదు.

**--ఇవీ ప్రతిపాదనలు.......** ప్రస్తుతం ఉడాన్ మార్గాన్ని బిడ్‌లో గెలుచుకున్న సంస్థ, 4 నెలల్లో విమాన సర్వీసును ప్రారంభించాలి. మూడేళ్ల పాటు ఆ సంస్థ విమానాలే నడుస్తాయి. సబ్సిడీ వ్యవధిని ప్రస్తుత 3 సంవత్సరాలకు మించి పొడిగించాలి. మారుమూల ప్రాంతాల విమానాశ్రయాల్లో విమాన ఇంధనం (ఏటీఎఫ్)పై తక్కువ పన్నులుంటాయి. విమానాశ్రయ ఫీజులుండవు.




# రష్యా నుంచి భారత్‌కు చమురు దిగుమతులు తగ్గాయ్

రష్యా నుంచి మన దేశానికి చమురు దిగుమతులు గణనీయంగా తగ్గుతున్నాయి. ఈనెల తొలి 3 వారాల్లో సగటున రోజుకు 1.1 మిలియన్ బ్యారెళ్ల చమురు మాత్రమే దిగుమతి అయ్యింది. 2025 డిసెంబరులో రోజుకు 1.21 మి.బ్యారెళ్ల చమురు దిగుమతి అయ్యింది. గతేడాది మధ్యలో చూస్తే రోజుకు 2 మి.బ్యారెళ్ల చొప్పున ముడిచమురును రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకుందని విశ్లేషణా సంస్థ కెప్లర్ వెల్లడించింది. దేశీయ ముడిచమురు అవసరాల్లో 90 శాతాన్ని మనదేశం దిగుమతి చేసుకుంటోంది. ఇక్కడి రిఫైనరీల్లో దీన్నుంచి పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాలను ఉత్పత్తి చేస్తుంటారు. పాశ్చాత్య దేశాల ఆంక్షలు తీవ్రమవ్వడంతో.. డిసెంబరు నుంచి రష్యా ముడిచమురు దిగుమతులను మనదేశం వ్యూహాత్మకంగా తగ్గించుకుంటూ వస్తోంది. పశ్చిమాసియాలోని సంప్రదాయ సరఫరాదార్ల నుంచి మనదేశం దిగుమతులు పెంచుకుంటోంది. కెప్లర్ డేటా ప్రకారం, ఇరాక్ ఇప్పుడు రష్యా స్థాయిలో మనకు ముడిచమురు సరఫరా చేస్తోంది. 2025 డిసెంబరులో సగటున రోజుకు 9,04,000 బ్యారెళ్ల చమురును ఇరాక్ సరఫరా చేసింది. సౌదీ అరేబియా నుంచి చమురు దిగుమతి పరిమాణం ఈ నెలలో రోజుకు సగటున 9,24,000 బ్యారెళ్లకు చేరింది. డిసెంబరులో ఇది 7,10,000 బ్యారెళ్లుగా ఉంది. 2025 ఏప్రిల్‌లో కనిష్ఠంగా 5,39,000 బ్యారెళ్లుగా నమోదైంది.


**--2022 తరవాత రష్యా నుంచి అధికంగా.....** ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభించిన రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించడంతో, 2022 నుంచి భారీ తగ్గింపు ధరకు ముడిచమురును మనకు రష్యా ఆఫర్ చేసింది. అప్పటివరకు మనదేశానికి ముడిచమురును ఇరాక్ అధికంగా సరఫరా చేసేది. దాన్ని అధిగమించి మన దేశానికి అత్యధికంగా ముడి చమురు సరఫరా చేసే దేశంగా రష్యా నిలిచింది. 2022కు ముందు మన చమురు దిగుమతుల్లో రష్యా వాటా 1% కంటే తక్కువ కాగా, ఈ పరిణామాల్లో అది గరిష్ఠంగా సుమారు 40 శాతానికి చేరింది. రష్యా సరఫరాదార్లపై అమెరికా మరిన్ని ఆంక్షలను డిసెంబరులో విధించడంతో, మన కొనుగోళ్లు మందగించాయి.




# బడ్జెట్‌పైనే మార్కెట్ దృష్టి

**–స్వల్పకాలంలో బలహీనతలు**
**–వాహన, యంత్రపరికరాల షేర్లకు ప్రతికూలతలు**
**–సిమెంటు స్క్రిప్‌లకు సానుకూలతలు**
**–విశ్లేషకుల అంచనాలు**

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారమూ ఒత్తిడిలోనే ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. టారిఫ్ అనిశ్చితులు, విదేశీ మదుపర్ల అమ్మకాలతో సెంటిమెంటు దెబ్బతినడం ఇందుకు కారణం. ఫిబ్రవరి 1న (ఆదివారం) ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలు, సానుకూలతలు తేవచ్చని మార్కెట్ వర్గాలు ఆశిస్తున్నాయి. ఆరోజు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సాధారణ పనిగంటల్లో పనిచేయనున్నాయి. మూలధన లాభాల పన్నులో కొన్ని మార్పులు వస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కార్పొరేట్ సంస్థల డిసెంబరు త్రైమాసిక ఫలితాలు, పారిశ్రామికోత్పత్తి వృద్ధి గణాంకాలు, విదేశీ మదుపర్ల ధోరణి, రూపాయి కదలికలు ప్రభావం చూపుతాయి. నిఫ్టీ50 కంపెనీలు 2025 తరహాలోనే ఈ ఏడాదీ 10% వృద్ధిని సాధించొచ్చని బ్రోకరేజీ సంస్థలు పేర్కొంటున్నాయి. శనివారం వెల్లడైన అల్ట్రాటెక్ సిమెంట్, కోటక్ మహీంద్రా బ్యాంక్ ఫలితాల ప్రభావం మంగళవారం కనిపించొచ్చు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మార్కెట్లకు సోమవారం సెలవు కావడం ఇందుకు నేపథ్యం. రేట్ల కోతపై అమెరికా ఫెడరల్ రిజర్వ్ సంకేతాలనూ గమనించాలి. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే.. టారిఫ్ పెంపు సమీప భవిష్యత్తులో ఉండకపోవచ్చు కనుక, టెలికాం షేర్లకు కంపెనీల ఆర్థిక ఫలితాలే కీలకంగా మారనున్నాయి. భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా సాంకేతిక చార్టుల్లో బలహీనంగా కనిపిస్తున్నాయి. భారతీ ఎయిర్‌టెల్ రూ.1900 స్థాయికి పడొచ్చు. రూ.2020 వద్ద నిరోధం ఉంది. వొడాఫోన్‌ఐడియాకు రూ.8.8 వద్ద మద్దతు, రూ.10.20 వద్ద నిరోధం కనిపిస్తోంది. కోటక్ మహీంద్రా బ్యాంక్ ఫలితాలతో పాటు సోమవారం వెలువడే యాక్సిస్ బ్యాంక్ ఫలితాలు నిఫ్టీ బ్యాంక్ సూచీకి దిశానిర్దేశం చేయొచ్చు. బ్యాంక్ నిఫ్టీ 58,000 కంటే కిందకు వస్తే 57,50057,100కు దిద్దుబాటు కావచ్చు. పైకి కదిలితే మాత్రం 59,350 59,500కు పుంజుకోవచ్చు. దేశీయంగా సంకేతాలు లేనందున ఐటీ షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. తాత్కాలిక దిద్దుబాటు కనిపించొచ్చు. అమెరికా ఫెడ్ సమావేశంపై దృష్టిసారించాలి. ఐటీ సూచీకి 37,000 వద్ద మద్దతు, 39,000 వద్ద నిరోధం కనిపిస్తోంది. యంత్రపరికరాల కంపెనీల షేర్లు నష్టపోవచ్చు. బుధవారం వెల్లడయ్యే ఎల్ అండ్ టీ ఫలితాల నుంచి ఈ రంగ కంపెనీలు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు. రాబోయే బడ్జెట్‌లో మూలధన వ్యయాల పెంపులో వృద్ధి పెద్దగా ఉండకపోవచ్చన్నది అంచనా. సిమెంటు కంపెనీల షేర్లు రాణించొచ్చు. ఇటీవల పెంచిన సిమెంటు ధరలు ఇందుకు దోహదం చేయొచ్చు. ఉత్తర భారత్‌లో బస్తా ధన మరో రూ.5 చొప్పున పెరిగే అవకాశం ఉందని ఓ బ్రోకరేజీ అంటోంది. ఏసీసీ ఫలితాలు బుధవారం ఉన్నాయి. ప్రాథమిక, విలువైన లోహ ధరల చలనాలతో పాటు బడ్జెట్ నుంచీ లోహ తయారీ కంపెనీ షేర్లు సంకేతాలు అందుకోవచ్చు. శుక్రవారం వెల్లడయ్యే జిందాల్ స్టీల్, సెయిల్, నాల్కో గణాంకాలను గమనించాలి. ముడి చమురు ధరలు పెరుగుతుండడంతో నిఫ్టీ చమురుగ్యాస్ సూచీ నష్టపోవచ్చు. దీనికి 11,00010,900 వద్ద మద్దతు, 11,50011,550 వద్ద నిరోధం కనిపిస్తున్నాయి. చమురు మార్కెటింగ్ కంపెనీ షేర్లపై ప్రభావం పడొచ్చు. ఔషధ కంపెనీల షేర్లు ఫలితాల నుంచి సంకేతాలు అందుకోవచ్చు. క్యాన్సర్ మందు రెవ్లిమిడ్ విక్రయాలకు అనుగుణంగా, వీటి మార్జిన్లు తగ్గుతున్నాయి. సన్ ఫార్మా ఈ వారం ఫలితాలు వెల్లడించనుంది. వాహన కంపెనీల షేర్లు ఒత్తిడిని ఎదుర్కోవచ్చు. జీఎస్‌టీ కోత నేపథ్యంలో, డిసెంబరు ఫలితాలు కావడంతో వాహన కంపెనీలు వృద్ధిని నమోదు చేయొచ్చు. బుధవారం మారుతీ సుజుకీ, టీవీఎస్ మోటార్; శుక్రవారం బజాజ్ ఆటో, ఎక్సైడ్ ఫలితాలు ప్రకటించనున్నాయి.



## 'మాతృభూమి'ని ప్రేమించే వారికి!



"దేశాన్ని తమకంటే ఎక్కువగా ప్రేమించే ప్రతి ఒక్కరికీ.." అంటూ 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' చిత్రబృందం 'మాతృభూమి' అనే గీతాన్ని విడుదల చేసింది. బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తూ.. నిర్మిస్తున్న చిత్రమిది. చిత్రాంగద సింగ్ కథానాయిక. అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ పాటలో సల్మాన్ ఓ వైపు యుద్ధభూమిలో సైనికుడిగా వీరత్వం ప్రదర్శించడంతో పాటు.. మరోవైపు కుటుంబ సభ్యులతో ప్రేమగా ఉండే సన్నివేశాలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. సమీర్ అంజన్ సాహిత్యమందించగా ఈ గీతాన్ని అర్జిత్ సింగ్, శ్రేయా ఘోషల్ ఆలపించారు. ఈ సినిమాని ఏప్రిల్‌లో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో భారత్, చైనా జవాన్ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణలో మన సైనికులు కొందరు వీర మరణం పొందారు. ఈ సంఘటన ఆధారంగానే ఈ సినిమా రూపొందుతోంది.

# అసభ్యంగా ప్రవర్తించారు.

కర్నాల్ (హరియాణా)లోని ఓ కార్యక్రమంలో ఎదురైన చేదు అనుభవాన్ని పంచుకుంటూ బాలీవుడ్ నటి మౌనీరాయ్ (Mouni Roy) ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వేడుకలో కొందరు ఫొటోల పేరుతో తనపై వేధింపులకు పాల్పడ్డారని తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.

"కర్నాల్‌లో జరిగిన ఈవెంట్‌లో తాత వయసున్న ఇద్దరు అతిథులు నాతో అసభ్యంగా ప్రవర్తించారు. ఆ సమయంలో వారిపై అసహ్యం కలిగింది. వేదికపైకి వెళుతుండగా ఆ ఇద్దరు, వారి కుటుంబ సభ్యులు (పురుషులు) ఫొటోల పేరుతో నా నడుముపై చేతులు వేశారు. వెంటనే 'సర్ దయచేసి మీ చేతులు తీయండి' అని విజ్ఞప్తి చేశా. అయినా అతడి ప్రవర్తన మారలేదు. స్టేజ్‌పై ఉండగా ఇద్దరు అంకుల్స్ అసభ్యకర రీతిలో సైగలు చేస్తూ ఇబ్బంది పెట్టారు. లో యాంగిల్‌లో వీడియోలు తీశారు. దీంతో ప్రదర్శనను అనుకున్న సమయానికన్నా ముందే ముగించేయాల్సి వచ్చింది. ఇంత జరిగినా వారి కుటుంబ సభ్యులుగానీ ఈవెంట్ ఆర్గనైజర్లుగానీ ఆపే ప్రయత్నం చేయలేదు. నాలాంటి వారికే ఇలా జరిగితే కొత్తగా పరిశ్రమలోకి వచ్చే వారి అమ్మాయిల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించండి. అక్కడ నాకు అవమానంగా అనిపించింది. ఈ ఘటనపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నా"

"మేం నిజాయతీగా పనిచేస్తూ సంపాదించుకునే కళాకారులం. మరొకరి సెలబ్రేషన్స్‌లోనూ భాగం అవుతుంటాం. అయితే, మేం వారి అతిథులమైనా.. వారు మాత్రం మమ్మల్ని ఇలా వేధించడం ఎంతవరకు సమంజసం" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 'నాగిని' సీరియల్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్న మౌనీరాయ్.. 'గోల్డ్', 'మేడిన్ చైనా', 'బ్రహ్మాస్త్ర', 'ది భూత్నీ' తదితర చిత్రాల్లో నటించారు. 'రన్', 'కేజీయఫ్ 1' (కన్నడ), 'వేదా' లాంటి సినిమాల్లో ప్రత్యేక గీతాలతో విశేష క్రేజ్ పొందారు. చిరంజీవి హీరోగా వశిష్ఠ తెరకెక్కిస్తున్న 'విశ్వంభర'లోని స్పెషల్ సాంగ్‌లో మౌనీనే సందడి చేయనున్నారు..:



## అనుబంధాల 'చాయ్ వాలా'

చాయ్ వాలా'లోని తండ్రీ కొడుకుల ఎమోషన్ అందర్నీ కట్టిపడేస్తుంది'' అన్నారు హీరో శివ కందుకూరి. ఇప్పుడాయన.. తేజు అశ్విని జంటగా ప్రమోద్ హర్ష తెరకెక్కించిన ఈ సినిమాని రాధా వి పావుడిప్పు నిర్మించారు. రాజీవ్ కనకాల, రాజ్ కుమార్ కసిరెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఫిబ్రవరి 6న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో టైటిల్ గీతాన్ని విడుదల చేశారు. ఈ వేడుకలో సిటీ కమిషనర్ వీసీ సజ్జనార్, నీలోఫర్ ఫౌండర్ బాబురావు, కిమ్స్ ఎండీ రవికిరణ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిటీ కమిషనర్ సజ్జనార్ మాట్లాడుతూ.. ''టైటిల్ గీతం బాగుంది. ఈ సినిమా యువతకు స్ఫూర్తినిచ్చేలా ఉంటుందని నమ్ముతున్నా. ఇందులో తండ్రీ కొడుకుల అనుబంధంతో పాటు చాలా అంశాలున్నట్లు అర్థమవుతోంది. తప్పకుండా ఈ సినిమా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకముంది'' అన్నారు. ''ఈ సినిమాలో తండ్రీ కొడుకుల ఎమోషన్ చాలా బాగుంటుంది. అలాగే చాయ్‌కి.. షాప్ ఓనర్‌కీ మధ్య అద్భుతమైన ఎమోషన్ ఉంటుంది'' అన్నారు నిర్మాత రాజ్ కందుకూరి. ఈ కార్యక్రమంలో రాజీవ్ కనకాల, ప్రమోద్ హర్ష, ప్రశాంత్ ఆర్ విహారి, వెంకట్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.



## త్రిముఖ వ్యూహం



"కామెడీ, థ్రిల్లింగ్ అంశాలు నిండిన కథతో రూపొందిన సినిమా 'త్రిముఖ'" అన్నారు దర్శకుడు రాజేశ్ నాయుడు. ఆయన దర్శకత్వం వహించిన ఈ బహుభాషా చిత్రంలో యోగేశ్ కల్లె హీరోగా నటించారు. సన్నీ లియోన్ ప్రధాన పాత్ర పోషించారు. ఆకృతి అగర్వాల్, సాహితీ దాసరి, ప్రవీణ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా ఈనెల 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రాజేశ్ మాట్లాడుతూ.. "ఇది మంచి కథ, బలమైన స్క్రీన్‌ప్లేతో రూపొందిన సినిమా. ప్రథమార్థం వినోదాత్మకంగా.. ద్వితీయార్థం థ్రిల్లింగ్‌గా ఉంటుంది. దీంట్లోని ప్రతి పాత్ర ఒక మంచి విషయాన్ని తెలియజేస్తుంది" అన్నారు. "ఈ చిత్రంలో సన్నీ లియోన్ పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ సినిమాతో ఆమెకు నటిగా మంచి పేరొస్తుంది" అన్నారు హీరో యోగేశ్ కల్లె.

# జీవితాంతం మిమ్మల్ని అలరిస్తా

## ..మెగాస్టార్ చిరంజీవి

సినిమా ఇండస్ట్రీలోకి వచ్చి పనిచేస్తానని ఏ ఆడబిడ్డ, మగబిడ్డ అయినా అంటే వారిని ప్రోత్సహించి పంపాలని, తెలుగు సినీ ఇండస్ట్రీ గొప్పదని అగ్ర కథానాయకుడు చిరంజీవి (Chiranjeevi) అన్నారు. జీవితాంతం ప్రేక్షకులను అలరిస్తూనే ఉంటానని తెలిపారు. ఆయన కీలక పాత్రలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు'. (Mana Shankara Vara Prasad Garu) నయనతార కథానాయిక. వెంకటేశ్ కీలక పాత్ర పోషించారు. సంక్రాంతి కానుకగా వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుని రూ.300 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. ఈ సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సభలో చిరంజీవి మాట్లాడారు.

**——ఆ సామర్థ్యం అనిల్‌కే ఉంది..**

''వింటేజ్ చిరంజీవినే కాదు.. మళ్లీ విజయోత్సవాలను జరుపుకొనే వైభవాన్ని తీసుకొచ్చిన ఘనత దర్శకుడు అనిల్ రావిపూడికి దక్కుతుంది. ఇంతటి ఘన విజయాన్ని అందించిన తెలుగు సినీ ప్రేక్షకులకు ధన్యవాదాలు. సినిమా టీమ్ విజయానందాన్ని అనుభవిస్తుంటే, నాకూ సంతోషంగా ఉంది. అనిల్‌ను చూస్తుంటే రాఘవేంద్రరావుగారు గుర్తుకు వచ్చేవారు. రోజూ సెట్‌లో వినోదాన్ని పంచేవారు. ఈ మూవీ షూటింగ్‌కు వెళ్తుంటే ఎంతో ఆనందంగా ఉండేది. ప్రతి సినిమా కష్టపడి పనిచేస్తాం. కానీ, కొన్ని సినిమా ఫలితాలు ఉత్సాహాన్ని ఇస్తాయి. అలాంటిదే ఈ మూవీ. ఈ సంక్రాంతికి దాదాపు అన్ని సినిమాలను ఆదరించారు. సినిమాలో వెంకీ ఉండాలని కోరుకున్నా. దాన్ని అనిల్ సాకారం చేశాడు. ఎంత పెద్ద స్టార్‌నైనా హ్యాండిల్ చేసే సామర్థ్యం అనిల్ రావిపూడికి ఉంది. మళ్లీ అనిల్‌తో చేసే అవకాశం మా ఇద్దరిలో ఎవరికి వస్తుందో చూడాలి.''

**——సినీ ఇండస్ట్రీ అద్దంలాంటిది..**

''నిర్మాత సాహు గారపాటి అస్సలు మాట్లాడరు. కానీ, రషెస్ చూసి, హిట్ కొట్టేస్తున్నామని చెప్పేశారు. అన్నట్లుగానే మూవీ హిట్ అయింది. ఇక నా కుమార్తె ఇండస్ట్రీలోకి వస్తానంటే ప్రోత్సహించిన తొలి వ్యక్తి మా అబ్బాయి రామ్‌చరణ్. 'రంగస్థలం' కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా పనిచేసింది. కష్టం ఒక్కటే ఆయుధమని తెలుసుకున్న వ్యక్తి నా కుమార్తె సుస్మిత. సినీ ఇండస్ట్రీ అద్దంలాంటిది. మనం ఎలా ఉంటామో అలాంటి ఫలితాన్నే ఇస్తుంది. ఎవరైనా సరే సినీ ఇండస్ట్రీలోకి వస్తానంటే వారిని ప్రోత్సహించాలి. ఇది గొప్ప ఇండస్ట్రీ. 'ఇక్కడ నెగెటివ్ పీపుల్ ఉంటారు. చేదు అనుభవాలను ఎదురవుతాయి' అనుకుంటే అది నీ తప్పిదం. నువ్వు నిక్కచ్చిగా ఉంటే ఎవరూ అవకాశం తీసుకోరు. క్యాస్టింగ్ కౌచ్‌లాంటివి ఉండవు. నువ్వు ప్రొఫెషనల్‌గా ఉండాలి. కొత్త టాలెంట్‌కు ఎప్పుడూ ప్రోత్సాహం లభిస్తూనే ఉంటుంది. ఇందులో చేసిన ప్రతి నటుడు, సాంకేతిక నిపుణుడు ఎంతో ఉత్సాహంగా నటించారు. నయనతార సినిమాలో చేయడమే కాదు, ప్రమోషన్స్ కూడా చేసింది. ఆ మెరిట్ కూడా అనిల్‌కే దక్కుతుంది. సినిమా పరుగులు పెట్టడానికి ఎడిటర్ తమ్మిరాజు కారణం. వీటీ గణేశ్ ఎపిసోడ్‌ను తీసేయాలనే మంచి నిర్ణయం తీసుకున్నారు. కొన్నిసార్లు త్యాగాలు తప్పవు''



**——మీ పాజిటివ్ ఎనర్జీయే నాకు శక్తి..**

''ఇటీవల ఒకామె మాట్లాడిన వీడియో చూసి, భావోద్వేగానికి గురయ్యా. 'ఏమయ్యా.. చిరంజీవి ఎప్పటి నుంచో కష్టపడుతూనే ఉన్నావు. మమ్మల్ని ఆనందింపజేయడానికి ఓపిక ఉన్నా లేకపోయినా ఇప్పటికీ అలాగే పనిచేస్తున్నావు. డబ్బుల కోసం నువ్వు పనిచేస్తున్నావని నేను అనుకోను. నువ్వు ఇలా కష్టపడుతుంటే నాకు బాధగా ఉంది' అని అన్నారు. నిజంగా ఆ తల్లికి ఈ సభాముఖంగా ధన్యవాదాలు చెబుతున్నా. ఇది అందరూ ఇచ్చే ప్రశంస కాదు. ఇలాంటి అభిమానులను భగవంతుడు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఆ మాటలకు ఆనందంతో నా కళ్లు చెమర్చాయి. 'అమ్మా.. మీకు ఆనందం ఇవ్వడానికి నేను కష్టపడినా దానిలో నేను సంతోషాన్ని పొందుతున్నాను. చిరంజీవి మమ్మల్ని అలరించాలనే కోరుకునే మీ (అభిమానులు) పాజిటివ్ ఎనర్జీ నుంచే నాకు ఈ శక్తి వస్తోంది. ఈ జన్మ ఉన్నంత వరకూ మిమ్మల్ని అలరిస్తూనే ఉంటాను'' అని చిరంజీవి అన్నారు.



## ఉస్తాద్ ఉత్సాహం

ఈసారి వేసవి సీజన్‌ని 'ఉస్తాద్ భగత్‌సింగ్' ఆరంభిస్తాడనే ప్రచారం ఊపందుకుంది. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా... హరీష్‌శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ ఆరంభంలో విడుదల కావొచ్చని పరిశ్రమ వర్గాల అంచనా. త్వరలోనే ఈ సినిమాలోని రెండో గీతం ఆవిష్కరణతోపాటు, సినిమా విడుదల తేదీపై కూడా స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి. చిత్రబృందం అదే సంకేతాల్నే ఇచ్చింది. రథసప్తమిని పురస్కరించుకుని ఆదివారం పోస్టర్‌ని విడుదల చేస్తూ, ఉస్తాద్ ఉత్సవానికి సిద్ధం కావాలంటూ పిలుపునిచ్చింది. సాధారణంగా తెలుగులో మార్చి నుంచి వేసవి సినిమాల జోరు మొదలైపోతుంది. అయితే అగ్ర తారలు నటించిన సినిమాలు విడుదలైన రోజు నుంచే అసలైన సీజన్ మొదలైనట్టు ఉంటుంది. మార్చిలో రామ్‌చరణ్ 'పెద్ది', నాని 'ది ప్యారడైజ్' సినిమాలు విడుదల ఖరారు చేసుకున్నాయి. అయితే ఆ సినిమాలు ఇప్పటికీ చిత్రీకరణ దశలోనే ఉన్నాయి. మరోవైపు మార్చి నెల దగ్గర పడుతోంది. ఈ పరిస్థితుల్లో ఆ రెండు సినిమాల విడుదల మార్చిలో సాధ్యమా అనే ప్రశ్న తలెత్తుతోంది. దాంతో పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటించిన 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమాతోనే ఈ ఏడాది వేసవి మొదలవుతుందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.



# గుకేశ్, అర్జున్ ఓటమి



టాటా స్టీల్ చెస్ మాస్టర్స్ టోర్నీలో ప్రపంచ ఛాంపియన్ గుకేశ్ వరుసగా రెండో ఓటమి చవిచూశాడు. అతడు ఏడో రౌండ్లో అనీష్ గిరి (నెదర్లాండ్స్) చేతిలో కంగుతిన్నాడు. మరో భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేశి.. యాగిజ్ కాన్ (తుర్కియే) చేతిలో పరాజయం పాలయ్యాడు. సుదీర్ఘంగా సాగిన గేమ్‌లో అతడు.. 52వ ఎత్తులో ఓడిపోయాడు. అర్జున్, గుకేశ్ మూడేసి పాయింట్లతో ఉన్నారు. మతియాస్ బ్లూబమ్ (జర్మనీ)తో గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రా చేసుకున్నాడు. అతడు 2.5 పాయింట్లతో అట్టడుగున ఉన్నాడు. అబ్దుసతారోవ్ (ఉజ్బెకిస్థాన్) 5.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

# మెద్వెదెవ్ ఔట్

**–క్వార్టర్స్‌లో సబలెంకా, అల్కరాస్**

**–ఆస్ట్రేలియన్ ఓపెన్**



ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సంచలనం నమోదైంది. రష్యా స్టార్ ఆటగాడు ఆండ్రీ మెద్వెదెవ్ ప్రిక్వార్టర్స్‌లో ఇంటిముఖం పట్టాడు. ఆదివారం పురుషుల సింగిల్స్‌లో 11వ సీడ్ మెద్వెదెవ్ 46, 06, 36తో లెర్నర్ టియాన్ (అమెరికా) చేతిలో వరుస సెట్లలో ఓడాడు. తొలి సెట్ నుంచి టియాన్ దూకుడు ప్రదర్శించాడు. తొలి గేమ్‌లోనే మెద్వెదెవ్ సర్వీస్ బ్రేక్ చేసిన ఈ అమెరికా కుర్రాడు..31తో ఆధిక్యంలో నిలిచాడు. అదే జోరుతో సెట్‌ను గెలుచుకున్నాడు. రెండో సెట్ ఆట సైతం మొదటి సెట్‌నే తలపించింది. ఈసారి మెద్వెదెవ్ మరింత తేలిపోయాడు. తొలి గేమ్‌లోనే సర్వీస్ కోల్పోయిన అతడు 05తో వెనుకబడి.. ఆ తర్వాత సెట్ చేజార్చుకున్నాడు. మూడో సెట్లోనూ మెద్వెదెవ్ పుంజుకోలేకపోయాడు. మరోసారి తొలి గేమ్‌లోనే సర్వీస్ కోల్పోయిన అతడు.. ఆపై సెట్‌తో పాటు మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. 6 డబుల్ ఫాల్ట్‌లు, 30 అనవసర తప్పిదాలతో మెద్వెదెవ్ మూల్యం చెల్లించుకున్నాడు. టాప్‌సీడ్ అల్కరాస్ (స్పెయిన్) క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రిక్వార్టర్స్‌లో అతడు 76 (86), 64, 75తో టామీ పాల్ (అమెరికా)ను ఓడించాడు. తొలి సెట్లో మాత్రమే అల్కరాస్‌కు పాల్ నుంచి పోటీ ఎదురైంది. మ్యాచ్‌లో అల్కరాస్ 2 ఏస్‌లు, 35 విన్నర్లు కొట్టాడు. మూడుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేశాడు. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై గురిపెట్టిన నొవాక్ జకోవిచ్ (సెర్బియా) కూడా క్వార్టర్స్ చేరాడు. అతడి ప్రిక్వార్టర్స్ ప్రత్యర్థి జాకబ్ మెన్సిచ్ (చెక్) గాయంతో వైదొలగడంతో.. బరిలో దిగకుండానే నొవాక్ ముందంజ వేశాడు. మూడో సీడ్ జ్వెరెవ్ 62, 64, 64తో సెరున్‌డోలో (అర్జెంటీనా)పై, డిమెనార్ (ఆస్ట్రేలియా) 64, 61, 61తో బబ్లిక్ (కజకిస్థాన్)పై గెలిచారు.

**గాఫ్ ముందుకు:** కెరీర్ గ్రాండ్‌స్లామ్‌పై గురిపెట్టిన అర్యానా సబలెంకా (బెలారస్) ఆ దిశగా మరో అడుగు వేసింది. ఈ టాప్‌సీడ్ ప్లేయర్ పెద్దగా కష్టపడకుండానే క్వార్టర్‌ఫైనల్ చేరింది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సబలెంకా 61, 76 (71)తో ఎంబాకో (కెనడా)ను ఓడించింది. తొలి సెట్లో దూకుడుగా ఆడిన సబలెంకా.. 51తో ఆధిక్యంలో నిలిచింది. అదే జోరుతో సెట్ గెలిచింది. రెండో సెట్లో ప్రత్యర్థి నుంచి సబలెంకాకు ప్రతిఘటన ఎదురైంది. ఒక దశలో ఆమె 41తో తేలిగ్గా సెట్ గెలిచేలా కనిపించినా.. ఎంబాకో 55తో పుంజుకుంది. దీంతో టైబ్రేకర్ తప్పలేదు. టైబ్రేకర్‌లో పదునైన సర్వీసులతో అదరగొట్టిన సబలెంకా సెట్‌తో పాటు మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. మ్యాచ్‌లో సబలెంకా 6 ఏస్‌లు, 31 విన్నర్లు కొట్టింది. మూడో సీడ్ కొకో గాఫ్ (అమెరికా) 61, 36, 63తో ముచోవా (చెక్)పై కష్టంగా గెలిచింది. తొలి సెట్లో 50తో ఆధిక్యంలో నిలిచిన గాఫ్.. ఆపై తేలిగ్గా సెట్ చేజిక్కించుకుంది. రెండో సెట్లో ముచోవా దూకుడుగా ఆడింది. రెండో గేమ్‌లోనే గాఫ్ సర్వీస్ బ్రేక్ చేసిన ఈ చెక్ అమ్మాయి.. సెట్ గెలిచి మ్యాచ్‌లో నిలిచింది. అయితే మూడో సెట్లో గాఫ్ సత్తా చాటింది. నాలుగో గేమ్‌లో బ్రేక్ సాధించిన ఆమె 31తో ఆధిక్యంలో నిలిచింది. అదే ఊపులో సెట్‌తో పాటు మ్యాచ్‌ను దక్కించుకుంది. పన్నెండో సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) 62, 64తో ఎనిమిదో సీడ్ ఆండ్రీవా (రష్యా)ను ఓడించింది. జోవిచ్ (అమెరికా) కూడా క్వార్టర్స్ చేరింది. ఆమె 60, 61తో పుటింట్సెవా (కజకిస్థాన్)ను చిత్తు చేసింది.

**మాయ, అర్ణవ్ ఔట్:** ఆస్ట్రేలియన్ ఓపెన్ జూనియర్ విభాగంలో సింగిల్స్‌లో భారత్ పోరాటం ముగిసింది. బాలికల తొలి రౌండ్లో మాయ 46, 16తో అనా పష్కెరెవా (రష్యా) చేతిలో ఓడింది. బాలుర సింగిల్స్ తొలి రౌండ్లో అర్ణవ్ 36, 46తో విహాన్ రెడ్డి (అమెరికా)కి తలొంచాడు.



# వేటాడేశారు

**–10 ఓవర్లలోనే 154 పరుగుల ఛేదన**

**–అభిషేక్, సూర్య విధ్వంసం**

**–విజృంభించిన బుమ్రా, హార్దిక్**

**–మూడో టీ20లో కివీస్‌పై భారత్ ఘనవిజయం**

**–సిరీస్ కైవసం**



భారత్‌న్యూజిలాండ్ మూడో టీ20.. మొదట కివీస్ చాలా కష్టపడి 153 చేసింది. బౌలర్ల విజృంభణ చూస్తే టీమ్‌ఇండియాకు కూడా ఛేదన సులభం కాదేమో అనిపించింది. కానీ భారత్ ఇన్నింగ్స్‌లో 10 ఓవర్లు పడగానే మ్యాచ్ అయిపోయింది! టీమ్‌ఇండియా చేతిలో కివీస్ చిత్తయింది. మరో రెండు మ్యాచ్‌లు ఉండగానే సిరీస్ సూర్య సేన సొంతమైంది. అభిషేక్ శర్మ, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ విధ్వంసమే ఇందుకు కారణం. ఆకాశమే హద్దుగా సిక్స్‌లతో చెలరేగిన అభిషేక్, సూర్య భారత్‌కు ఘన విజయాన్ని అందించారు. అంతకుముందు బుమ్రా, హార్దిక్, రవి బిష్ణోయ్ బంతితో అదరగొట్టి న్యూజిలాండ్‌ను కట్టడి చేశారు.

**భారత్‌ది అదే ఆధిపత్యం.. అదే దూకుడు..!** బంతితో విజృంభించి బ్యాట్‌తో బాదేసిన సూర్య సేన.. మూడో టీ20లో న్యూజిలాండ్‌ను 8 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించింది. సిరీస్‌లో 30 ఆధిక్యం సంపాదించింది. ఆదివారం మొదట కివీస్ 9 వికెట్లకు 153 పరుగులు చేసింది. గ్లెన్ ఫిలిప్స్ (48; 40 బంతుల్లో 6×4, 1×6), మార్క్ చాప్‌మన్ (32; 23 బంతుల్లో 2×4, 2×6), మిచెల్ శాంట్నర్ (27; 17 బంతుల్లో 3×4, 1×6) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జస్ప్రీత్ బుమ్రా (3/17), రవి బిష్ణోయ్ (2/18), హార్దిక్ పాండ్య (2/23) ప్రత్యర్థిని కట్టడి చేశారు. అభిషేక్ శర్మ (68 నాటౌట్; 20 బంతుల్లో 7×4, 5×6), సూర్యకుమార్ (57 నాటౌట్; 26 బంతుల్లో 6×4, 3×6) సుడిగాలి ఇన్నింగ్స్‌లతో భారత్ కేవలం 10 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఇషాన్ కిషన్ (28; 13 బంతుల్లో 3×4, 2×6) కూడా మెరిశాడు. బుధవారం విశాఖపట్నంలో నాలుగో టీ20 జరగనుంది.

**ఆ ఇద్దరి బాదుడు:** లక్ష్యమేమీ పెద్దది కాదు. కివీస్ కష్టపడిన తీరు చూస్తే.. మరీ తేలిగ్గా కూడా అనిపించలేదు. అలాంటి స్థితిలో ఛేదనలో తొలి బంతికే సంజు శాంసన్ (0) వికెట్ కోల్పోయింది టీమ్‌ఇండియా. వైఫల్యాలను కొనసాగిస్తూ.. హెన్రీ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు శాంసన్. వికెట్ పడినా కూడా తొలి ఓవర్ ముగిసే సరికి భారత్ 16/1తో నిలిచింది. కారణం ఇషాన్. వరుసగా రెండు సిక్స్‌లు, ఫోర్ బాదిన అతడు భారత ఇన్నింగ్స్‌కు వేగాన్ని అందించాడు. ఆ తర్వాత ఓవర్లో అభిషేక్ సిక్స్‌తో ఆ జోరు కొనసాగింది. 3 ఓవర్లకు భారత్ 49/1తో లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. సోధి బౌలింగ్‌లో ఇషాన్ ఔటైనా.. అభిషేక్ తగ్గలేదు. డఫీ వేసిన ఆరో ఓవర్లో అతడు టాప్‌గేర్‌కు వెళ్లిపోయాడు. ఆ ఓవర్లో 2 సిక్స్‌లు, 2 ఫోర్లు కొట్టిన అభి.. కేవలం 14 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. గత మ్యాచ్‌లో ఫామ్‌లోకి వచ్చిన సూర్యకుమార్ కూడా రెచ్చిపోయాడు. సోధి బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు బాదిన అతడు..శాంట్నర్ బౌలింగ్‌లో మరో సిక్స్, ఫోర్ కొట్టాడు. అభిషేక్ బలమైన పుల్ షాట్లు, కట్ షాట్లతో పరుగులు చేస్తే.. సూర్య తన శైలిలో ర్యాంప్ షాట్లు, గ్లాన్స్ సిక్స్‌లతో అలరించాడు. దీంతో భారత్ సాధించాల్సిన లక్ష్యం కర్పూరంలా కరిగిపోయింది. సమీకరణం 66 బంతుల్లో 15 పరుగులుగా మారింది. ఫిలిప్స్ వేసిన పదో ఓవర్లో 6, 4, 4 కొట్టిన సూర్య.. 25 బంతుల్లో అర్ధసెంచరీ చేయడమే కాక భారత్‌కు ఘన విజయాన్ని అందించాడు. 60 బంతులు ఉండగానే టీమ్‌ఇండియా గెలిచింది.

**కివీస్ కట్టడి:** అంతకుముందు భారత బౌలర్లు న్యూజిలాండ్‌కు కళ్లెం వేశారు. తొలి ఓవర్లోనే డెవోన్ కాన్వే (1)ను హర్షిత్ రాణా ఔట్ చేశాడు. ముందుకొచ్చి మిడాఫ్ మీదుగా షాట్ ఆడదామని ప్రయత్నించిన కాన్వే.. హార్దిక్ పట్టిన ఓ మెరుపు క్యాచ్‌కు వెనుదిరిగాడు. ఈ పర్యటనలో కాన్వేను ఔట్ చేయడం హర్షిత్‌కు ఇది అయిదోసారి కావడం విశేషం. ఆ తర్వాతి ఓవర్లో కివీస్‌కు మరో షాక్ తగిలింది. హార్దిక్ ఓ షార్ట్ బంతితో రచిన్ రవీంద్ర (4) కథ ముగించాడు. 2 ఓవర్లకు 17/2తో న్యూజిలాండ్ ఇబ్బందుల్లో పడింది. ఈ స్థితిలో ఫిలిప్స్ అడపాదడపా ఫోర్లు కొట్టి స్కోరు పెంచాడు. 5 ఓవర్లకు న్యూజిలాండ్ 34/2తో నిలిచింది. గత మ్యాచ్‌లో విశ్రాంతి తీసుకుని తిరిగొచ్చిన బుమ్రా ఈ మ్యాచ్‌లో అదరగొట్టాడు. ఆరో ఓవర్లో సీఫర్ట్ (12)ను అతడు ఓ అద్భుతమైన బంతితో బౌల్డ్ చేశాడు. దీంతో పవర్ ప్లే ఆఖరికి కివీస్ 36/3తో నిలిచింది. బుమ్రా, బిష్ణోయ్ కట్టుదిట్టంగా బంతులు వేయడంతో కివీస్ బ్యాటర్లు వేగంగా పరుగులు చేయలేకపోయారు. ఈ స్థితిలో కుల్‌దీప్ వేసిన తొమ్మిదో ఓవర్లో చాప్‌మన్ 6, 4.. ఫిలిప్స్ ఓ సిక్స్ బాదడంతో స్కోరు బోర్డు వేగాన్ని అందుకుంది. 11 ఓవర్లకు 82/3తో కివీస్ కోలుకుంది. కానీ గేర్లు మార్చాల్సిన సమయంలో చాప్‌మన్‌తో పాటు మిచెల్ (14), ఫిలిప్స్ ఔట్ కావడంతో ఆ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. కానీ కెప్టెన్ శాంట్నర్ పోరాడడంతో న్యూజిలాండ్ కాస్త గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది.

**యువీ తర్వాత...** అంతర్జాతీయ టీ20ల్లో యువరాజ్ తర్వాత అత్యంత వేగంగా అర్ధశతకం చేసిన భారత బ్యాటర్‌గా అభిషేక్ శర్మ ఘనత సాధించాడు. కివీస్‌తో మూడో టీ20లో అతడు 14 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. యువరాజ్ 2007 ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్‌పై 12 బంతుల్లోనే ఈ మైలురాయిని అందుకున్నాడు.

**న్యూజిలాండ్ ఇన్నింగ్స్:** కాన్వే (సి) హార్దిక్ (బి) హర్షిత్ రాణా 1; సీఫర్ట్ (బి) బుమ్రా 12; రచిన్ రవీంద్ర (సి) బిష్ణోయ్ (బి) హార్దిక్ 4; ఫిలిప్స్ (సి) ఇషాన్ (బి) బిష్ణోయ్ 48; చాప్‌మన్ (సి) శాంసన్ (బి) బిష్ణోయ్ 32; మిచెల్ (సి) ఇషాన్ (బి) హార్దిక్ 14; శాంట్నర్ (సి) అభిషేక్ (బి) బుమ్రా 27; జేమీసన్ (బి) బుమ్రా 3; హెన్రీ రనౌట్ 1; సోధి నాటౌట్ 2; డఫీ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 5 మొత్తం: (20 ఓవర్లలో 9 వికెట్లకు) 153; వికెట్ల పతనం: 12, 213, 334, 486, 5112, 6112, 7132, 8134, 9144; బౌలింగ్: హర్షిత్ రాణా 40351; హార్దిక్ పాండ్య 30232; రవి బిష్ణోయ్ 40182; బుమ్రా 40173; కుల్‌దీప్ 30320; శివమ్ దూబె 20240

**భారత్ ఇన్నింగ్స్:** సంజు శాంసన్ (బి) హెన్రీ 0; అభిషేక్ శర్మ నాటౌట్ 68; ఇషాన్ కిషన్ (సి) చాప్‌మన్ (బి) సోధి 28; సూర్యకుమార్ యాదవ్ నాటౌట్ 57; ఎక్స్‌ట్రాలు 2 మొత్తం: (10 ఓవర్లలో 2 వికెట్లకు) 155; వికెట్ల పతనం: 10, 253; బౌలింగ్: హెన్రీ 20281; జాకబ్ డఫీ 20380; జేమీసన్ 10170; ఇష్ సోధి 20281; శాంట్నర్ 20280; ఫిలిప్స్ 10160





# క్రీడా పద్మాలు

**––అమృత్‌రాజ్‌కు పద్మభూషణ్**

**–––రోహిత్, హర్మన్‌లకు పద్మశ్రీ పురస్కారాలు**

భారత టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృత్‌రాజ్‌ను దేశ మూడో అత్యున్నత పౌర పురస్కారం పద్మ భూషణ్ వరించింది. 2026లో ఈ అవార్డు పొందిన ఏకైక క్రీడాకారుడు అతడే. సారథులుగా భారత్‌కు ప్రపంచ కప్‌లు అందించిన రోహిత్‌శర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు పద్మశ్రీ పురస్కారం లభించింది. కేంద్ర ప్రభుత్వం ఆదివారం పద్మ అవార్డులను ప్రకటించింది. భారత హాకీ మాజీ ఆటగాడు బల్‌దేవ్ సింగ్, మహిళల హాకీ మాజీ గోల్ కీపర్ సవిత పునియా, పారా హైజంపర్ ప్రవీణ్‌కుమార్, పారా పవర్ లిఫ్టర్లు భగ్వాన్‌దాస్ రైక్వార్, పజనివేల్‌లు కూడా పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. దిగ్గజ రెజ్లింగ్ కోచ్ వ్లాదిమర్ మెస్‌త్‌విరిష్విలి (జార్జియా)ని మరణానంతరం పద్మశ్రీ అవార్డుతో గౌరవించారు. సుశీల్ కుమార్, యోగేశ్వర్ దత్, బజ్‌రంగ్ పునియా, విజయ్ దహియా వంటి రెజ్లర్లకు అతడు కోచ్‌గా వ్యవహరించాడు.

**ఆల్‌రౌండర్ అమృత్‌రాజ్....** డేవిస్‌కప్ దిగ్గజం విజయ్ అమృత్‌రాజ్ స్వస్థలం చెన్నై. కెరీర్‌లో సింగిల్స్ 15, డబుల్స్‌లో 13 టైటిళ్లు సాధించిన అతనికి 1983లో పద్మశ్రీ పురస్కారం లభించింది. 1974, 1987లో డేవిస్‌కప్ ఫైనల్స్ చేరుకున్న భారత జట్లలో అమృత్‌రాజ్ సభ్యుడు. ఏటీపీ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా 18వ స్థానంలో నిలిచాడు. 1973, 1981 వింబుల్డన్.. 1973, 1974 యుఎస్ ఓపెన్‌లలో అమృత్‌రాజ్ క్వార్టర్‌ఫైనల్స్ చేరుకున్నాడు. అతడు 1976లో వింబుల్డన్ డబుల్స్‌లో సెమీఫైనల్ వరకు వెళ్లాడు. సింగిల్స్ కెరీర్‌లో 405312 గెలుపోటముల రికార్డు అమృత్‌రాజ్ సొంతం. ఆటగాడిగా రిటైరైన తర్వాత వ్యాఖ్యాతగా మారిన అతడు.. పలు సినిమాల్లో నటించాడు కూడా. 72 ఏళ్ల అమృత్‌రాజ్‌కు క్రీడాపాలకుడిగానూ అనుభవం ఉంది.

**దూకుడైన కెప్టెన్....** దూకుడైన బ్యాటింగ్‌తో హిట్‌మ్యాన్‌గా పేరుతెచ్చుకున్న రోహిత్ శర్మ.. కెప్టెన్‌గానూ భారత క్రికెట్‌పై బలమైన ముద్ర వేశాడు. అతడి సారథ్యంలోనే టీమ్‌ఇండియా 2024లో టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకుంది. 2025లోనూ ఛాంపియన్స్ ట్రోఫీని కూడా చేజిక్కించుకుంది. రోహిత్ వన్డేల్లో 11577, టెస్టుల్లో 4301, టీ20ల్లో 4231 పరుగులు చేశాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి 50 సెంచరీలు, 111 అర్ధసెంచరీలు సాధించాడు. మాజీ కెప్టెన్ రోహిత్ ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. మిగతా రెండు ఫార్మాట్ల నుంచి అతడు రిటైరయ్యాడు.

**ఆమె సారథ్యంలో....** భారత క్రికెట్‌కు 2025 మైలురాయిలా నిలిచిపోయిన నేపథ్యంలో హర్మన్‌ప్రీత్ కౌర్‌కు పద్మశ్రీ అవార్డు వరించింది. ఆమె సారథ్యంలోనే భారత జట్టును నిరుడు తొలిసారి ఐసీసీ మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకుంది. వన్డే ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాను భారత జట్టు ఓడించిన సంగతి తెలిసిందే. ధోని తర్వాత సొంతగడ్డపై ప్రపంచకప్ అందుకున్న భారత రెండో కెప్టెన్‌గా హర్మన్ ఘనత సాధించింది. బ్యాటర్‌గానూ గొప్ప రికార్డు ఆమె సొంతం. హర్మన్‌ప్రీత్ వన్డేల్లో 4409, టీ20ల్లో 3784 పరుగులు చేసింది. 6 టెస్టుల్లో 200 పరుగులు సాధించింది.





